


తెలుగు జాతీయ దినపత్రిక

# అక్షర విజేత

నిజం నిర్భయం నిష్పక్షం

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక




హైదరాబాద్ సంపుటి:05 సంచిక :241 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజీలు : 12, వెల. 6రూ/ శనివారం- 07 - మార్చి - 2026

## రాజకీయ లబ్ధి కోసం దేవుడిని వాడుకోవడం సరికాదన్న రోజా



కూటమి నేతలు పుణ్యక్షేత్రాల ప్రతిష్టను దిగజార్చుతున్నారని మండిపాటు

హామీలు నేరవేర్చలేకపోతే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలని హితవు

అమరావతి : ఏపీలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేత, మాజీ మంత్రి ఆర్కే రోజా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ... రాజకీయ లబ్ధి కోసం దేవుడిని, ఆలయాల ప్రతిష్ఠను వాడుకోవడం తగదని హితవు పలికారు. మిగతా..2లో

## పశ్చిమాసియాలో యుద్ధం.. శంషాబాద్ నుంచి 12 విమానాలు రద్దు

గల్ఫ్ దేశాలకు వెళ్లవలసిన విమానాలు రద్దైనట్లు అధికారులు వెల్లడి

గల్ఫ్ దేశాల నుంచి రావాల్సిన 12 కూడా విమానాలు రద్దయ్యాయన్న అధికారులు

ఖతార్, యూఏఈ, కువైట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా నుంచి రావాల్సిన విమానాలు రద్దు



హైదరాబాద్: శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లవలసిన 12 విమానాలు రద్దయ్యాయి. ఈ మేరకు ఆర్జీఐఏ అధికారులు వెల్లడించారు. పశ్చిమాసియాలో మిగతా..2లో

## ఇది ఉత్తి దండగ ప్రచార పర్వం తప్ప మరొకటి కాదు




- ★ కాంగ్రెస్ ప్రభుత్వ 99 రోజుల ప్రణాళికపై హరీశ్ రావు విమర్శలు
- ★ గతంలో ఇచ్చిన దరఖాస్తులు ఇంకా చెత్తబుట్టల్లోనే ఉన్నాయని వెల్లడి
- ★ రైతు భరోసా ఇవ్వకుండా అన్నదాతలను నడిరోడ్డుపైకి తెచ్చారని ఆగ్రహం
- ★ పాలన గాలికి వదిలి పబ్లిసిటీ పాకులాడుతున్నారని మండిపాటు

హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

# గత ఎన్నికల్లో మాటలు, మూటలతో గెలవలేదు

- చిత్తశుద్ధితో ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.
- ప్రజాపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు.


వివరాలు 2లో..

హైదరాబాద్, మార్చి 06: చిత్తశుద్ధితో ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా సీఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పుడున్నది మీరంతా కోరుకున్న ప్రభుత్వమని తెలిపారు. ఇది మీరంతా కష్టపడి తెచ్చుకున్న ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎన్నికల్లో మీరంతా తమకు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. మార్పు కోసమే ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని

## రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ

- అంబర్ పేట ఫ్లైఓవర్ కింద సర్వీస్ రోడ్డు నిర్మాణంలో అడ్డంకులు
- సర్వీస్ రోడ్డు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్న కిషన్ రెడ్డి
- రేవంత్ రెడ్డి చొరవ చూపి సమస్య పరిష్కరించాలని కోరిన కేంద్ర మంత్రి




హైదరాబాద్: అంబర్‌పేట ఫ్లై ఓవర్ కింద సర్వీస్ రోడ్డు నిర్మాణంలో ఎదుర వుతున్న అడ్డంకులను తొలగించాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. గత ఏడాది మే నెలలోనే ఈ ఫ్లై ఓవర్‌ను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించినప్పటికీ, కింద సర్వీస్ రోడ్డు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కిషన్ రెడ్డి తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తయినా, భూసేకరణలో జాప్యం కారణంగా సర్వీస్ రోడ్డు పనులు నిలిచిపో యాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణకు సంబంధించి రూ. 2.54 కోట్ల పరిహారం ప్రభుత్వం చెల్లించినప్పటికీ, కొన్ని శక్తులు అడ్డుతగులుతున్నాయని

## దేశానికి మార్చి చివరికల్లా నక్సలిజం నుంచి విముక్తి




- ★ నక్సలిజం నిర్మూలనలో సీఐఎస్ఎఫ్ కీలకపాత్ర పోషించిందన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా
- ★ రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలనుకున్న వారిని భద్రతాదళాలు ఓడించాయన్న షా

## పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు- ఖతార్ లోని భారతీయులకు ట్రావెల్ అడ్వైజరీ

- తీవ్రమవుతున్న ఇరాన్ వర్సెస్ అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం
- ఖతార్ లోని భారతీయులకు కీలక ప్రయాణ మార్గదర్శకాలు ఇచ్చిన దోహాలోని భారత రాయబార కార్యాలయం


2లో..

ఢిల్లి : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో ఖతార్ లోని ప్రవాస భారతీయులకు దోహాలోని భారత రాయబార కార్యాలయం శుక్రవారం కీలక అడ్వైజరీ జారీ చేసింది. వీసా, ట్రాన్సిట్ , ప్రయాణాల విషయాల్లో చాలా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఖతార్ లో చిక్కుకుపోయిన భారతీయులకు సౌదీ అరేబియా మీదుగా ప్రయాణించేందుకు తాత్కాలిక ట్రాన్సిట్ వీసా సౌకర్యాన్ని కల్పించేందుకు రిజిస్ట్రేషన్ లింక్ ను అందుబాటులోకి తెచ్చింది. "సౌదీ అరేబియా నుంచి బయటకు వెళ్లేందుకు కన్ఫార్మ్ టికెట్లు ఉండి, ప్రస్తుతం ఖతార్ లో చిక్కుకున్న భారతీయులకు తాత్కాలిక ట్రాన్సిట్ వీసా సౌకర్యం కల్పిస్తాం.

### దోహాలోని భారత రాయబార కార్యాలయం

ఖతార్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖ జారీ చేసిన ప్రకటనను కూడా ఇండియన్ ఎంబసీ ఊటంకించింది. గడువు ముగిసిన లేదా ముగియనున్న అన్ని రకాల ఎంట్రీ వీసాలను నెలపాటు పొడిగించినట్లు పేర్కొంది. అయితే ఇది 2026 ఫిబ్రవరి 28 నుంచి అమల్లోకి వస్తుందని

## 15ఏళ్ల యువతిపై లైంగిక వేధింపులు

# ఎప్ స్టీన్ ఫైల్స్ లో ట్రంప్‌పై ఆరోపణలు!

### వెలుగులోకి మరిన్ని ఎప్‌స్టీన్ ఫైళ్లు- ట్రంప్‌పై సంచలన ఆరోపణలు

ఢిల్లి : ప్రపంచవ్యాప్తంగా సంచలనం రేపిన ఎప్ స్టీన్ సెక్స్ కుంభకోణానికి సంబంధించిన కొత్త పత్రాలు మరోసారి చర్చకు దారితీశాయి. ఈ కేసుకు సంబంధించిన మరిన్ని ఫైళ్లను తాజాగా అమెరికా న్యా శాఖ (డిఓజే) విడుదల చేసింది. ఈ పత్రాల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై తీవ్ర ఆరోపణలు ఉన్నట్లు వెల్లడవడంతో అమెరికా రాజకీయాల్లో మళ్లీ పెద్ద చర్చ మొదలైంది. న్యాయశాఖ విడుదల చేసిన తాజా పత్రాల ప్రకారం, ఒక మహిళ 2019లో ఎఫ్ బీఐ అధికారులకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక ఆరోపణలు చేసింది. తాను 13 నుంచి 15 ఏళ్ల మధ్య వయసులో ఉన్న సమయంలో ఎప్‌స్టీన్ తనను న్యూయార్క్ లేదా న్యూజెర్సీ ప్రాంతాలకు తీసుకెళ్లి ట్రంప్‌కు పరిచయం చేశాడని ఆమె తెలిపినట్లు పత్రాల్లో పేర్కొన్నారు. ఆ తర్వాత



ట్రంప్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆమె ఆరోపించింది.

### మొత్తం 47 వేలకుపైగా పత్రాల విడుదల

ఆమె వివరాల ప్రకారం, ట్రంప్ తనతో అసభ్యంగా ప్రవర్తించాడని, తనను బలవంతం చేయడానికి ప్రయత్నించాడని ఎఫ్‌బీఐ అధికారులకు తెలిపింది. ఆ సమయంలో తనను కాపాడుకోవడానికి ట్రంప్‌ను నోటితో కొరికినట్లు మిగతా..2లో

## జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం వల్ల రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది





- ★ అసెంబ్లీలో బడ్జెట్, ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ
- ★ తాజా బడ్జెట్ 5 కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపమన్న పవన్
- ★ వైసీపీ హయాంలో విద్యుత్ సంస్థలు రూ. 1.29 లక్షల కోట్ల నష్టాల్లో కూరుకుపోయాయని వెల్లడి

అమరావతి : ఆంధ్రప్రదేశ్ శాసనసభలో బడ్జెట్, ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగిన చర్చలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

## కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం

# 13 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం




- పిల్లలు సోషల్ మీడియా వినియోగంపై సీఎం చంద్రబాబు అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు
- 13 ఏళ్ల లోపువారు సామాజిక మాధ్యమాలు వాడకుండా నిషేధిస్తున్నామని 16 ఏళ్ల వారి విషయంపైనా ఆలోచిస్తున్నామని వెల్లడి

అమరావతి : ఏపీలో 13 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను బ్యాన్ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో మంత్రి నారా లోకేశ్ దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇప్పుడు తాజాగా సీఎం చంద్రబాబు అసెంబ్లీలో పిల్లలు సోషల్ మీడియా వినియోగించకుండా నిషేధం విధించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తమ రాష్ట్రంలోని 16 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధిస్తున్నట్లు తాజాగా వెల్లడించారు. పిల్లలు మొబైల్ ఫోన్ వ్యసనం బారినపడకుండా అడ్డుకోవడానికే ఈ ముందుజాగ్రత్త చర్యను చేపడుతున్నట్లు తెలిపారు. పిల్లలు సోషల్ మీడియా వినియోగంపై సీఎం చంద్రబాబు అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు చేశారు. 13 ఏళ్లలోపు వారు సోషల్ మీడియా ఉపయోగించకుండా నిషేధం విధించనున్నట్లు వెల్లడించారు. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. 13 ఏళ్ల లోపు వారికి సంబంధించి సోషల్ మీడియా బ్యాన్ చేస్తే బాగుంటుందని ఆ వయసు లోపు వారికి సోషల్ మీడియా అందుబాటులో మిగతా..2లో

## శాసనమండలికి వచ్చిన బొత్సను ఆత్మీయంగా పలకరించిన నారా లోకేశ్

- ఇటీవల అనారోగ్యం పాలైన బొత్స సత్యనారాయణ
- పూర్తి ఆరోగ్యంతో బొత్స సభకు రావడం సంతోషంగా ఉందన్న లోకేశ్
- లోకేశ్ కి ధన్యవాదాలు తెలిపిన బొత్స



అమరావతి : ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ఈరోజు ఒక ఆసక్తికరమైన, ఆరోగ్యకరమైన సన్నివేశం చోటుచేసుకుంది. ఇటీవల వైసీపీ నేత, మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ స్వల్ప అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. హైదరాబాద్ లోని ఓ ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందారు. మిగతా..2లో

మొదటి పేజీ తరువాయి

## కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం
# 13 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం

లేకుండా చేసే కార్యక్రమానికి 90 రోజుల్లో శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. 13-16 ఏళ్లలోపు వారికి సంబంధించి ఏం చేయాలన్నదానిపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సోషల్ మీడియా వల్ల మన పిల్లలు నష్టపోకూడదని. దానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. టెక్నాలజీని వాడుకుంటే ఆయుధంగా పనిచేస్తుందని, బానిసైతే జీవితాలు నాశనమవుతాయని అన్నారు. దావోస్ లో వెల్లడించిన మంత్రి లోకేశ్: ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో పిల్లలు సోషల్ మీడియా వినియోగించడంపై మంత్రి నారా లోకేశ్ అభిప్రాయాన్ని వెల్లడించారు. అలానే కొద్ది రోజుల క్రితం సచివాలయంలో నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల సదస్సులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ బాలబాలికలు సోషల్ మీడియా వినియోగించకుండా నియంత్రించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వినియోగంపై ప్రత్యేక చట్టం తీసుకొస్తామని ప్రకటించారు. సోషల్ మీడియా అడ్డం పెట్టుకుని అసభ్య దూషణలతో వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. గతంలో అసభ్య పదజాలంతో రెచ్చిపోయిన వారిని వదిలిపెట్టకుండా నియంత్రించగలిగామని గుర్తు చేస్తూ మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని, ఏపీని అత్యంత సురక్షిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## శాసనమండలికి వచ్చిన బొత్సను
# ఆత్మీయంగా పలకరించిన నారా లోకేశ్

అనారోగ్యం నుంచి కోలుకున్న ఆయన ఈరోజు సభకు హాజరయ్యారు. బొత్స సభలోకి రాగానే మంత్రి నారా లోకేశ్ ఎంతో ఆత్మీయంగా స్పందిస్తూ, 'బొత్స సత్యనారాయణ గారు నమస్కారం' అంటూ పలకరించారు. తొలుత బొత్స గమనించకపోవడంతో, మండలి చైర్మన్ మోషేను రాజు జోక్యం చేసుకుని మంత్రి మిమ్మల్ని పలకరిస్తున్నారని తెలియజేశారు. "గురువుగారు (బొత్స) చిన్న అనారోగ్య సమస్యతో బాధపడ్డారు. ఆయన మళ్ళీ పూర్తి ఆరోగ్యంతో సభకు రావడం చాలా సంతోషంగా ఉంది" అని లోకేశ్ అన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ కి బొత్స ధన్యవాదాలు తెలిపారు. రాజకీయంగా వైరిపక్షాలైనప్పటికీ, వ్యక్తిగత ఆరోగ్యం విషయంలో లోకేశ్ చూపిన ఈ గౌరవం సభలో అందరినీ ఆకట్టుకుంది.

## జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం వల్ల
# రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది: పవన్ కల్యాణ్

ప్రసంగిస్తూ గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్ పాలనలో జరిగిన 'ఆర్థిక విధ్వంసం' కారణంగా రాష్ట్రం దాదాపు 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్, ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపమని ఆయన కొనియాడారు. ఇన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, సామాజిక భద్రతా పెన్షన్ల కోసమే రూ. 33 వేల కోట్లు కేటాయించడం సీఎం చంద్రబాబు సాహసోపేతమైన నిర్ణయమని ప్రశంసించారు. గత ప్రభుత్వ హయాంలో అనాలోచిత విద్యుత్ కొనుగోళ్ల వల్ల డిస్కంలకు రూ. 12,250 కోట్ల నష్టం వాటిల్లిందని, విద్యుత్ సంస్థలు రూ. 1.29 లక్షల కోట్ల నష్టాల్లో కూరుకుపోయాయని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 'ట్రూడౌన్' పేరిట ఛార్జీలు తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించామని పవన్ చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం రూ. 9 లక్షల కోట్ల అప్పులను, రూ. 35 వేల కోట్ల పెండింగ్ బిల్లులను వదిలి వెళ్లిందని విమర్శించారు. ఇందులో ఇప్పటికే రూ. 25 వేల కోట్ల బకాయిలను తమ ప్రభుత్వం చెల్లించిందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు ఇవ్వకపోవడం వల్ల రూ. 8,700 కోట్ల కేంద్ర నిధులు నిరుపయోగమయ్యాయని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం రూ. 7 వేల కోట్లు కేటాయించి ఇంటింటికీ మంచినీరు అందించే ప్రాజెక్టును వేగవంతం చేస్తోందని వివరించారు. "నేను నాటిన చెట్ల ఫలాలు నా కోసం కాదు.. భావితరాల కోసం" అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ సూక్తిని ఉటంకిస్తూ, బడ్జెట్‌లో భావితరాల బాగు కోసం సీఎం చంద్రబాబు మంచి నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు.

# దేశానికి మార్చి చివరికల్లా నక్సలిజం నుంచి విముక్తి

ఢిల్లీ : దేశంలో నక్సలిజాన్ని తుదముట్టించాలని మోదీ సర్కార్ తీసుకున్న సంకల్పాన్ని పూర్తిచేయటంలో సీఐఎస్ ఎఫ్ కీలకభూమిక పోషించినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణలో నక్సలిజాన్ని నిర్మూలించడంలో సీఐఎస్ ఎఫ్ కీలకపాత్ర పోషించిందన్నారు. ఒడిశాలోని ముండలిలో జరిగిన సీఐఎస్ ఎఫ్ 57వ వార్షికోత్సవంలో పాల్గొన్న అమిత్ షా తిరుపతి నుంచి పశుపతి వరకు రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని కలలు కనేవారి కలలను భద్రతా దళాలు కల్లలు చేశాయన్నారు. "ఈ సందర్భంగా దేశప్రజలకు ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నా. 2026 మార్చి 31 నాటికి దేశం నక్సల్స్‌రహితంగా మారుతుంది. తిరుపతి నుంచి పశుపతి వరకు రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని కలలు కన్నవారిని భద్రతాదళాలు పూర్తిగా ఓడించి తమ ఆధిపత్యం చాటుకున్నాయి. ప్రధాని మోదీ సారథ్యంలో భద్రతాదళాలకు ఇది అతిపెద్ద విజయం కానుంది."- అమిత్ షా, కేంద్ర హోంశాఖ మంత్రి

# రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ

తెలిపారు. తెలంగాణలో 2014 నుం ఇప్పటి వరకు 2,800 కిలోమీటర్ల జాతీయ రహదారులను నిర్మించామని... అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా చొరవ చూపి, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ అధికారుల ద్వారా ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు.

## పశ్చిమాసియాలో యుద్ధం..
# శంషాబాద్ నుంచి 12 విమానాలు రద్దు

ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ దేశాల మధ్య యుద్ధం నేపథ్యంలో విమానాల రద్దు కొనసాగుతోంది. శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన విమానాలతో పాటు గల్ఫ్ దేశాల నుంచి రావాల్సిన మరో 12 విమానాలు కూడా రద్దయ్యాయి. ఖతార్, యూఏఈ, కువైట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా నుంచి రావాల్సిన విమానాలు రద్దైనట్లు అధికారులు వెల్లడించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా 23 వేలకు పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. దీనితో విమానయాన సంస్థలకు రూ.100 కోట్ల డాలర్లకు పైగా నష్టం వాటిల్లింది. ఇది భారత కరెన్సీలో సుమారు రూ.9,165 కోట్లు. భారత విమానయాన సంస్థలపై కూడా ఈ ప్రభావం అధికంగానే ఉంది.

## రాజకీయ లబ్ధి కోసం దేవుడిని
# వాడుకోవడం సరికాదన్న రోజా

తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో వస్తున్న ఆరోపణలు అసత్యమని, భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాజకీయం చేయడానికి వేరే అంశాలు లేకనే దేవుడిని, ఆలయాలను వివాదాల్లోకి లాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల, శ్రీశైలం, అన్నవరం వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల ప్రతిష్ఠను కూటమి నేతలు దిగజార్చుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, హోం మంత్రి వంటి ఉన్నత స్థానాల్లో ఉన్న వారు బాధ్యతాయుతంగా మాట్లాడాలని హితవు పలికారు. శాసనమండలి చైర్మన్ స్థానంలో ఉన్న వ్యక్తి కులం, మతం గురించి మాట్లాడటం అత్యంత విచారకరమని వ్యాఖ్యానించారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో తమ వైపు తప్పు లేదని ప్రభుత్వం భావిస్తే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలని ఎద్దేవా చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు అసత్య ప్రచారాలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

## బ్లూస్పారో.. అంతరిక్షం
# అంచు నుంచి దూసుకొచ్చి.. ఖమేనీని టార్గెట్ చేసి..!

ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో తమ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీకోల్పోవడంతో ఇరాన్ ప్రతిదాడులు చేస్తోంది. దాంతో పశ్చిమాసియా రణరంగంలా మారింది. ఖమేనీని అంతం చేయడానికి ఇజ్రాయెల్ బ్లూ స్పారోను ఉపయోగించిందని తెలుస్తోంది. ఫైటర్‌జెట్ నుంచి ప్రయోగించే ఈ బాలిస్టిక్ క్షిపణిని.. మిస్సైల్ ఫ్రమ్ స్పేస్‌గా అభివర్ణిస్తుంటారు. ఇజ్రాయెల్ అభివృద్ధి చేసిన ఈ బ్లూస్పారో 2,000 కి.మీ.దూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేదించగలదు. 6.5 మీటర్ల పొడవు, 1.9 టన్నుల బరువు ఉంటుంది. యుద్ధ విమానం నుంచి ఈ అధునాతన బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగిస్తారు. అది బయటకు దూసుకురాగానే భూవాతావరణం అంచుకు వెళ్లి.. తిరిగి అక్కడి నుంచి భూమి మీద ఉన్న లక్ష్యాన్ని టార్గెట్ చేస్తుంది. అందుకే దీనిని 'మిస్సైల్ ఫ్రమ్ స్పేస్'గా పిలుస్తుంటారు. ఇది చాలాసార్లు శబ్ద వేగంతో నిలువుగా టార్గెట్ మీదకు పడిపోతుంది. దాంతో గగనతల రక్షణ వ్యవస్థలు దానిని గుర్తించి స్పందించడానికి సమయం ఉండదు. ఈ వ్యవస్థలు పైనుంచి నిటారుగా వచ్చే వాటిని అంత సులభంగా గుర్తించలేవు.

ఇరాన్ చౌక డ్రోన్లకు.. ఉక్రెయిన్ క్వాడ్‌కాప్టర్‌తో జవాబు

శత్రుదేశాల నుంచి వచ్చే బాలిస్టిక్ మిస్సైళ్లను అడ్డగించేందుకు ఇజ్రాయెల్ యారో మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌ను అభివృద్ధి చేసింది. దాని టెస్టింగ్ కోసం ఈ స్పారో క్షిపణులను తయారుచేసింది. ఇందులో బ్లూ, బ్లాక్, సిల్వర్ స్పారో అని మూడు రకాల క్షిపణులు ఉన్నాయి. తొలుత వీటిని టెస్టింగ్ కోసమే తీసుకువచ్చినప్పటికీ.. తర్వాత వాటిని శత్రుదేశాలపైనా ప్రయోగిస్తోంది. అతి తక్కువ సమయంలో అత్యంత కచ్చితత్వంతో చేసే దాడులకు బ్లూ స్పారో బాగా సరిపోతుందని రక్షణరంగ నిపుణులు చెప్తున్నారు. ఇప్పుడు ఇదే ఖమేనీ సహా ఇతర ఉన్నతాధికారులు సమావేశమైన కాంపౌండ్‌ను ఢీకొట్టింది. ఫిబ్రవరి 28 ఉదయం 7.30గంటల సమయంలో ఇజ్రాయెలీ ఎఫ్-15 యుద్ధ విమానాలు, ఇతర ఎయిర్‌క్రాఫ్ట్‌లను

# 15ఏళ్ల యువతిపై లైంగిక వేధింపులు ఎప్ స్టీన్ ఫైల్స్ లో ట్రంప్‌పై ఆరోపణలు!

మొదటి పేజీ తరువాయి

కూడా పేర్కొన్నట్లు పత్రాల్లో నమోదు చేశారు. ఆ ఘటన తర్వాత ఈ విషయాన్ని ఎవరికి చెప్పొద్దని తనకు మరియు తన కుటుంబ సభ్యులకు బెదిరింపు కాల్స్ వచ్చాయని ఆమె చెప్పినట్లు వెల్లడైంది. ఈ ఆరోపణలన్నీ 2019లో ఎఫ్‌బీఐ విచారణ సమయంలో నమోదు చేసిన ఇంటర్వ్యూలో భాగంగా ఉన్నట్లు న్యాయశాఖ అధికారులు పేర్కొన్నారు. అప్పట్లో సేకరించిన పలు ఫిర్యాదులు, ఇంటర్వ్యూలు, వాంగ్మూలాలను పరిశీలించిన తర్వాత మొత్తం 47 వేలకుపైగా పత్రాలను తాజాగా విడుదల చేసినట్లు తెలిపారు. అయితే ఈ కేసులోని కొన్ని పత్రాలపై భిన్నాభిప్రాయాలు కూడా ఉన్నట్లు అధికారులు చెప్పారు. గతంలో విడుదలైన కొన్ని ఎప్‌స్టీన్ ఫైళ్లలో ఈ మహిళ చేసిన ఆరోపణలు నిర్ధారణ కాలేదని, కొన్ని వర్గాలు వాటిని అసత్యంగా పేర్కొన్నాయని తెలిపారు. అందుకే ఆ వివరాలను మళ్లీ పరిశీలనకు పంపినట్లు పేర్కొన్నారు. అనంతరం తుది పరిశీలన పూర్తయిన తర్వాతే తాజా పత్రాలను ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు న్యాయశాఖ వెల్లడించింది.

పారదర్శకంగా విడుదల చేయాలని డిమాండ్



ఇదిలా ఉండగా, ఎప్‌స్టీన్ కేసుకు సంబంధించిన ఫైళ్లను డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఎలా నిర్వహిస్తోందన్న అంశంపై అమెరికాలో రాజకీయంగా తీవ్ర చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ప్రతిపక్ష డెమోక్రాటిక్ పార్టీ నాయకులు ఈ దర్యాప్తుపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కేసుకు సంబంధించిన అన్ని వివరాలను ప్రభుత్వం పూర్తిగా వెల్లడించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. డెమోక్రాట్ నేతల అభిప్రాయం ప్రకారం, ఎప్‌స్టీన్ కేసు చాలా పెద్ద అంతర్జాతీయ కుంభకోణం. ఇందులో ప్రభావవంతమైన వ్యక్తుల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. అందువల్ల ఈ కేసుకు సంబంధించిన ప్రతి పత్రాన్ని పారదర్శకంగా విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఈ ఆరోపణలను ట్రంప్ ఖండించారు. తనకు ఎప్‌స్టీన్ ఫైళ్లతో ఎలాంటి సంబంధం లేదని ఆయన గతంలో పలుమార్లు స్పష్టం చేశారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఎప్‌స్టీన్ కేసు ప్రపంచవ్యాప్తంగా భారీ సంచలనం సృష్టించింది. బాలికలను మోసం చేసి లైంగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న ఎప్ స్టీన్ 2019లో అరెస్టయ్యాడు. అదే ఏడాది జైలులో అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించడంతో ఈ కేసు మరింత వివాదాస్పదమైంది. ఎప్‌స్టీన్ కేసులో ప్రపంచవ్యాప్తంగా పలువురు ప్రముఖుల పేర్లు వినిపించాయి. రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, సినీ ప్రముఖులు ఇలా అనేక మంది పేర్లు ఈ కేసు చర్చల్లో వెలుగుచూశాయి. అయితే అందులో ఎవరి పాత్ర ఎంత అన్నది పూర్తిగా నిర్ధరణ కాలేదని విచారణ సంస్థలు అప్పట్లో పేర్కొన్నాయి.

## పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు
# ఖతార్ లోని భారతీయులకు ట్రావెల్ అడ్వైజరీ

మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేసింది. అయితే పరిస్థితులను బట్టి దీనిని మరింత పొడిగించే అవకాశం ఉంది.

### భూమార్గం ద్వారా!

అత్యవసర పరిస్థితుల్లో ఖతార్ నుంచి సౌదీ అరేబియాలకు వెళ్లేందుకు 'సాల్వా' అనే భూసరిహద్దు మార్గం ఉంది. ప్రస్తుతం అది తెరిచే ఉందని భారతీయులకు రాయబార కార్యాలయం సమాచారం అందించింది. అమెరికా, బ్రిటన్ లేదా స్కెంజెన్ వీసాలను (కనీసం ఒక్కసారైనా వాడి ఉండాలి) కలిగి ఉన్న భారతీయులు సౌదీ అరేబియాలో 'వీసా ఆన్ అరైవల్' పొందవచ్చని తెలిపింది. ఇతరులు మాత్రం నిర్ణీత నియమాలు, ప్రక్రియల ప్రకారం సౌదీ వీసాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ సమయంలో ఖతార్ కు వచ్చిన విమాన టికెట్లు, సౌదీ నుంచి బయటకు వెళ్లేందుకు ఉన్న కన్ఫార్మ్ డ్ టికెట్ కాపీలను సమర్పించాల్సి ఉంటుంది. అయితే సాల్వా భూ సరిహద్దు వరకు, అక్కడి నుంచి విమానాశ్రయం వరకు వెళ్లేందుకు ప్రయాణ ఏర్పాట్లను అభ్యర్థులే చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు కనీసం 48 గంటల సమయం పడుతుందని భారత రాయబార కార్యాలయం స్పష్టం చేసింది.

### భద్రత ముఖ్యం!

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా భారతీయులు అందరూ సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని, అనవసర ప్రయాణాలు మానుకోవాలని భారత రాయబార కార్యాలయం కోరింది. ముఖ్యంగా కిటికీలు, బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలని ఖతార్ అధికారులు జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించింది. తాజా వివరాల కోసం ఇండియన్ ఎంబసీ సోషల్ మీడియా ఖాతాలను (ఎక్స్ , ఫేస్ బుక్ , ఇన్ స్టాగ్రామ్ )లను ఫాలో కావాలని స్పష్టం చేసింది. ఇరాన్ ప్రతీకార దాడులు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం ఖతార్ గగనతలం మూసివేశారు. దీనితో విమాన సర్వీసులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. అందువల్ల ప్రయాణికులు తమ విమానయాన సంస్థలతో సంప్రదించాలని భారత రాయబార కార్యాలయం పేర్కొంది. ఖతార్ ఎయిర్ వేస్ 2026 మార్చి 7 నుంచి 9 వరకు (దోహా కాలమానం ప్రకారం) అప్ డేట్స్ ఇస్తుందని తెలిపింది. భారతీయుల కోసం తమ ఎంబసీ 24/7 అందుబాటులో ఉంటుందని పేర్కొంది.

### దీర్ఘకాలిక యుద్ధం తప్పదా?

దాదాపు వారం రోజుల క్రితం ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేశాయి. ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీని అతని కార్యాలయంలోనే అంతం చేశాయి. దీనితో ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. పశ్చిమాసియాలో అమెరికా దళాలకు ఆశ్రయం ఇచ్చిన దేశాలపై కూడా దాడులు చేస్తోంది. దీనితో యుద్ధం తీవ్రమైంది. ఈ నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ కూడా దాడులను మరింత ఉద్ధృతం చేశాయి. తాజాగా అమెరికా రక్షణ మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై తమ సైనిక చర్యను బలంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అమెరికాను ఇరాన్ నేతలు, ఐఆర్‌జీసీ తక్కువ అంచనా వేస్తున్నాయని, అయితే తాము తమ సంకల్పానికి కట్టుబడి ఉంటామని, ఇరాన్‌పై పోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. పూర్తి శక్తితో అమెరికా ఇప్పుడే దాడులను మొదలుపెట్టిందన్నారు. ఒకవేళ అవసరమైతే దీర్ఘకాలం పాటు ఈ యుద్ధాన్ని చేసేందుకూ అమెరికా సన్నద్ధమై ఉందని పేర్కొన్నారు.

# ఇది ఉత్తి దండగ ప్రచార పర్వం తప్ప మరొకటి కాదు

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం తాజాగా ప్రకటించిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ కేవలం ఉత్తి దండగ ప్రచార పర్వమని, ఇది ప్రజలను మభ్యపెట్టే మరో నాటకమని ఆయన ఎద్దేవా చేశారు. దాదాపు 800 రోజుల పాలనలో (రెండున్నరేళ్లు) చేసిందేమీ లేక, ఇప్పుడు ప్రజల దృష్టిని మరల్చేందుకే రేవంత్ రెడ్డి సర్కార్ ఈ కొత్త డ్రామాకు తెరతీసిందని ఆరోపించారు. గతంలో రెండుసార్లు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి స్వీకరించిన లక్షలాది దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోక ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని హరీశ్ రావు విమర్శించారు. ఆ దరఖాస్తులకే దిక్కులేదని, ఇప్పుడు మళ్లీ పది వారాల పాటు పది రకాల కార్యక్రమాలంటూ ప్రజలను మోసం చేయడం సిగ్గుచేటన్నారు. అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు, పాలనా వైఫల్యాలు, కోట్లు కొల్లగొట్టేందుకు చేసిన స్కాముల నుంచి తప్పించుకునేందుకే ఈ 'డైవర్షన్ ప్లాన్' రచించారని మండిపడ్డారు. మీ పాలనలో సగం కాలం పూర్తయినా ఇంకా ఎన్ని రోజులు ప్రచారాలతో నెట్టుకొస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతుల దయనీయ స్థితిని ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. పంట కోతల సమయం వచ్చినా ఈ సీజన్ రైతు భరోసా ఇవ్వలేదని, గత సీజన్ పంట బోనస్ ఎగ్గొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం యూరియా కూడా సరఫరా చేయలేక అన్నదాతలను నడిరోడ్డు మీదకు ఈడ్చారని, నమ్మించి గొంతుకోసిన ఈ మోసాల గురించి ఇప్పుడు గ్రామసభల్లో రైతులకు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. అలాగే యువతకు మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారని, జాబ్ క్యాలెండర్‌ను 'జాబ్ లెస్' క్యాలెండర్‌గా మార్చేశారని దుయ్యబట్టారు. మూసీ సుందరీకరణ పేరుతో లూటీకి ప్రాధాన్యత ఇస్తూ, నోటిఫికేషన్లను గాలికి వదిలేశారని విమర్శించారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు మూలనపడ్డాయని, ఇప్పుడు నైపుణ్య శిక్షణ అంటూ కొత్త పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి అంటూ ప్రభుత్వం పేర్లు గొప్పగా చెబుతున్నా.. వాస్తవానికి ఆసుపత్రుల్లో మందులు లేక, బడుల్లో వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు గుర్తుచేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయడం, పారిశుద్ధ్యం నిర్వహించడం కనీస బాధ్యత అని, దానిని కూడా ఒక



ఈవెంట్‌లా మార్చుకోవడం, గొప్పగా చెప్పుకోవడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. సోలార్ విద్యుత్, పర్యావరణం, డ్రగ్స్ నియంత్రణ వంటి అంశాలన్నీ కేవలం పత్రికల్లో పబ్లిసిటీ కోసమే తప్ప, ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని స్పష్టం చేశారు. పాలనను గాలికి వదిలి పబ్లిసిటీ గారడీలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు గ్రామ గ్రామాన ప్రజలు సిద్ధంగా ఉన్నారని హరీశ్ రావు హెచ్చరించారు.

# గత ఎన్నికల్లో మాటలు, మూటలతో గెలవలేదు

మొదటి పేజీ తరువాయి

వివరించారు. తమది పేదల పక్షపాత ప్రభుత్వమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. గత పాలకులు ఎన్నో అక్రమాలు చేశారని సీఎం రేవంత్ విమర్శించారు. గత ఎన్నికల్లో తాము మాటలు, మూటలతో గెలవలేదని కుండబద్దలు కొట్టారు. కేవలం ప్రజల మద్దతుతోనే తాము అధికారంలోకి వచ్చామని చెప్పారు. తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదన్నారు. వర్గీకరణ కోసం మాదిగ జాతి ఎంతో పోరాడిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఈ పోరాటంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్ల నుంచీ వర్గీకరణ సమస్య ఉందన్నారు. మీ న్యాయమైన హక్కు కోసం మొదటి నుంచీ మద్దతుగా ఉన్నానని తెలిపారు. వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సైతం పంపామని వివరించారు. మిత్రుడి కోసం కొన ఊపిరి వరకు కర్ణుడు నిలబడ్డాడని చెప్పారు. కర్ణుడి మాదిరిగా మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. వర్గీకరణ అంశంలో మాదిగల వైపు న్యాయం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా మీవైపే నిలబడ్డామని ఆయన



స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత.. వర్గీకరణ కోసం ప్రకటన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణనేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు ప్రభుత్వ ఉద్యోగులేనని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతే అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చామన్నారు. ప్రగతి ప్రణాళికలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఉద్యోగులకు సీఎం రేవంత్ హితవు పలికారు. తెలంగాణలో ఆర్థిక సమస్యలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం వద్ద పంచడానికి భూములు లేవన్నారు. ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటు అంతంత మాత్రంగానే ఉందని తెలంగాణ సీఎం తెలిపారు. మాదిగలకు మెరుగైన విద్య అందించాలన్నదే తమ ఆలోచన అని పేర్కొన్నారు. ప్రక్షాళన చేసేందుకే విద్యాశాఖను తన వద్ద పెట్టుకున్నానని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బర్రెలు, గొర్రెలు, చేపలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇవన్నీ మనకు తెలియవా.. వీళ్లు కొత్తగా ఇచ్చిందేంటి అంటూ బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ మండిపడ్డారు. మనం బర్రెలు, గొర్రెలు కాచుకోవాలా.. వాళ్ల పిల్లలు రాజ్యం ఏలుతారా అంటూ ఆ పార్టీ నేతలను సీఎం రేవంత్ సూటిగా ప్రశ్నించారు.

# ప్రపంచ దేశాల ముంగిట పెను సంక్షోభం.. చమురు ధర 150 డాలర్లు అయ్యే అవకాశం

మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కోలుకోలేని దెబ్బ తీసేలా కనిపిస్తోంది. గల్ఫ్ దేశాల నుండి చమురు సరఫరా నిలిచిపోతే, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 150 డాలర్ల(భారతీయ కరెన్సీలో సుమారు రూ.13783)కు చేరుకోవచ్చని ఖతార్ ఇంధన శాఖ మంత్రి సాద్ అల్-కాబీ హెచ్చరించారు. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల వల్ల తాము అంగీకరించిన ఒప్పందాల ప్రకారం చమురు సరఫరా చేయలేమని (ఫ్రీశీఫీఎవ మీఱవబఱీవ) గల్ఫ్ దేశాలు ప్రకటించే అవకాశం ఉందని కాబీ తెలిపారు. "యుద్ధం ఇలాగే కొనసాగితే, రాబోయే కొద్ది రోజుల్లో ఎగుమతిదారులు అందరూ తమ చేతులెత్తేయక తప్పదు. చట్టపరమైన బాధ్యతల నుండి తప్పుకోవడానికి ఇది తప్ప వారికి మరో మార్గం లేదు," అని ఆయన 'ఫైనాన్షియల్ టైమ్స్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

### ఖతార్ ఎల్ఎన్‌జీ ప్లాంట్‌పై దాడి:

ప్రపంచంలోనే రెండో అతిపెద్ద లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్



సరఫరాదారు అయిన ఖతార్ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఖతార్‌లోని అతిపెద్దదైన రాస్ లఫాన్ ఎల్ఎన్‌జీ ప్లాంట్‌పై ఇరాన్ డ్రోన్ దాడి చేసింది. ఈ దాడి కారణంగా జరిగిన నష్టాన్ని ఖతార్ ఎనర్జీ ఇంకా అంచనా వేస్తోంది. మరమ్మతులు పూర్తి కావడానికి ఎంత సమయం పడుతుందో ఇప్పుడే చెప్పలేమని మంత్రి వెల్లడించారు. యుద్ధం ఇప్పుడే ఆగిపోయినా, తిరిగి ఎగుమతులు సాధారణ స్థితికి రావడానికి వారాలు లేదా నెలలు పట్టవచ్చు. ఖతార్‌కు ఉన్న 128 ఎల్ఎన్‌జీ నౌకలలో ప్రస్తుతం కేవలం 6 లేదా 7 మాత్రమే సరుకును లోడ్ చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. మిగిలినవన్నీ వివిధ ప్రాంతాల్లో చెల్లాచెదురుగా ఉండిపోయాయి. దాడుల ముప్పు పొంచి ఉండటంతో కేవలం 24 గంటల్లోనే 9,000 మంది ఉద్యోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. "మా సైన్యం నుండి గ్రీన్ సిగ్నల్ వచ్చే వరకు మరియు పూర్తిస్థాయిలో కాల్పుల విరమణ జరిగే వరకు మేము ఉత్పత్తిని ప్రారంభించలేం. మా సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టలేం," అని సాద్ అల్-కాబీ స్పష్టం చేశారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ తిర్మల్ రెడ్డి

గ్రామ సర్పంచ్ పత్తి నర్సింలు యాదవ్



**విజేత గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం దామారకుంట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు పథకం లో భాగంగా పిట్టల భాస్కర్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ వేడుకలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ తిర్మల్ రెడ్డి గ్రామ సర్పంచ్ పత్తి నర్సింలు యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళా సాధికారత లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించగా మహిళల చేతుల్లోనే కుటుంబ ఆర్థిక స్థితిలో బాగుంటాయనే లక్ష్యంతో ప్రభుత్వ పథకాలను మహిళల పేరిటనే కేటాయిస్తున్నట్లు చెప్పారు. అలాగే కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు పాత కార్డులలో సభ్యులను చేర్చి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అంతే కాకుండా పంట రుణమాఫీ రైతు భరోసా. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు. 500 కే గ్యాస్ సిలిండర్. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దేవి విజయ రమేష్, వార్డు మెంబర్స్ రాజబోనా రమేష్, బక్కల ప్రభు, బక్కల సంజీవ, వనం శ్రీశేలం, పత్తి భానుచందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నక్క రమేష్, రాజబోయిన ఐలేని, చీరబోయిన ఆనంద్,న్యాలపల్లి పరమేష్,మాదరి,బాలరాజ్, అశోక్, నరసింహులు బాల నరసింహులు,ఆకుల రాజు, బాలచంద్రం,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక



**విజేత, ఇబ్రహీంపట్నం :-** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో మెప్మా ఆర్పీలు, మహిళా సంఘాలు, మున్సిపల్ స్టాఫ్ శానిటేషన్ వర్కర్స్ తో ఘనంగా మున్సిపల్ కమిషనర్ సుదర్శన్ చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నిర్వహించమని సీడీఎంఐ ఆదేశాల మేరకు మున్సిపల్ ఆఫీస్ ఇబ్రహీంపట్నం ప్రారంభించామని, ఈ కార్యక్రమాలు మార్చి 6 నుండి మార్చి 15 వరకు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో జరగనున్నవి. కాబట్టి ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి మున్సిపల్ ప్రజలు కూడా సహకరిచాలి అని కోరడమైనది.



# ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ విజయలక్ష్మి

పార్థివ దేహానికి నివాళులర్పించిన జిల్లా కాంగ్రెస్ నాయకులు



**విజేత ఖమ్మం ప్రతినిధి :** మాజీ జడ్పీ చైర్మన్ గోనెల విజయలక్ష్మి మరణం పట్ల సంతాపం తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గోనెల విజయలక్ష్మి (79) గురువారం గుండెపోటుతో మరణించడంతో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మరియు మున్నూరు కాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టి రంగారావు టేకులపల్లి మండలం ముత్యాలపాడు గ్రామశీలో వారి స్వగృహాన్ని సందర్శించి పూలు చల్లి నివాళులర్పించిన ఖమ్మం జిల్లా మరియు నగర కాంగ్రెస్ నాయకులు, మాజీ జెడ్పిటిసి రాష్ట్ర మున్నూరు కాపు వైస్ ప్రెసిడెంట్ పసుపులేటి దేవేందర్, ఖమ్మం నగర అధ్యక్షులు మదూరి పూర్ణచంద్రరావు జిల్లా మహిళా నాయకురాలు పసుపులేటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయలక్ష్మి వారి మరణం చాలా బాధాకరం అని అన్నారు, విజయలక్ష్మి మరణం ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు తీరనిలోటని అన్నారు. సుదీర్ఘకాలం నిస్వార్థంగా ప్రజా జీవితాన్ని గడిపారన్నారు పేద ప్రజలకు అండగా నిలుస్తూ తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారని ఆయన కొనియాడారు, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దైవాన్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

# జిల్లా గెజిటెడ్అధికారుల సమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తా..!

జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం ఉపాధ్యక్షులు

మహమ్మద్ సందాని



**విజేత, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం సమస్యల పరిష్కారమే దేహంగా పనిచేస్తానని జిల్లా ఉపాధ్యక్షులు మొహమ్మద్ సందాని అన్నారు. గెజిటెడ్ అధికారులు వారి యొక్క సమస్యలను జిల్లా కమిటీ దృష్టి నుండి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చర్చించి పరిష్కరించేందుకు తన సహాయ సహకారాలతో పాటు జిల్లా కమిటీ ఆమోదంతో పరిష్కరిస్తామన్నారు. తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం సమస్యలతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పనిచేయడం తన లక్ష్యమన్నారు. గెజిటెడ్ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కమిటీ దృష్టికి కానీ తన దృష్టికి కానీ తీసుకు రావాలన్నారు. సమస్యల పరిష్కారం దిశగా జిల్లా కమిటీ పని చేస్తుందన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చిన సంఘంలో చర్చించి పరిష్కరించడమే జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం పని అన్నారు.సంఘ సమస్యల పరిష్కారమే తమ లక్ష్యంగా పని చేయాల్సిన బాధ్యత సంఘానిదే అని గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ సందాని అన్నారు.

# డిజిటల్ అరెస్ట్ ద్వారా రు. 1.27 కోట్లు స్వాహా

(సి.హెచ్.ప్రతాప్)

మహారాష్ట్రలోని పుణే నగరంలోని ఒక ప్రశాంతమైన నివాసం. అక్కడ ఎనభై ఆరేళ్ల వయసున్న ఒక రిటైర్డ్ బ్యాంక్ అధికారి తన కేర్‌టేకర్ సహాయంతో నిరాడంబరంగా జీవనం సాగిస్తున్నారు. ఆయన ఇద్దరు కుమారులు ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. శేష జీవితాన్ని ప్రశాంతంగా, భక్తి భావంతో గడపాల్సిన ఆ వృద్ధుడు ప్రస్తుతం అత్యంత బాధాకరమైన క్యాన్సర్ వ్యాధితో పోరాడుతున్నారు. 1990వ దశకం చివరలో ఒక ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకులో సీనియర్ హోదాలో పదవీ విరమణ చేసిన ఆయనకు, సమాజంలో మంచి గౌరవం ఉంది. చట్టం అన్నా, క్రమశిక్షణ అన్నా ప్రాణమిచ్చే ఆయనకు, ఆ గౌరవమే ఒకరోజు తన పాలిట శాపంగా మారుతుందని కలలో కూడా ఊహించలేదు. కొన్ని వారాల క్రితం ఒక రోజు మధ్యాహ్నం, ఆయన వాట్సాప్‌కు అనుకోకుండా ఒక వీడియో కాల్ వచ్చింది. ఫోన్ ఎత్తగానే అవతలి వైపు పోలీస్ యూనిఫాంలో ఉన్న ఒక వ్యక్తి కనిపించాడు. అతని వెనుక భాగం సరిగ్గా ఒక పోలీస్ స్టేషన్ లాగే రూపొందించబడి ఉంది. ఆ వ్యక్తి తనను తాను ముంబై పోలీసు విభాగంలో 'ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్' అని పరిచయం చేసుకున్నాడు. "విజయ్ మాల్యా మనీ లాండరింగ్ కేసులో మీ ఆధార్ కార్డు, పాన్ కార్డు మరియు మీ బ్యాంక్ ఖాతా నంబర్లు విదేశీ లావాదేవీలకు ఉపయోగించబడ్డాయి. మా ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో మీ పేరు ప్రముఖంగా బయటకు వచ్చింది" అని ఆ గొంతు గంభీరంగా హెచ్చరించింది. ఆ మాట వినగానే ఆ వృద్ధుడి కాళ్లు వణకడం మొదలయ్యాయి. "అయ్యా, నేను ఒక సామాన్య రిటైర్డ్ ఉద్యోగిని. నేను చాలా వృద్ధుడిని, పైగా క్యాన్సర్ రోగిని. నాకు ఇలాంటి ఆర్థిక నేరాలతో గానీ, విజయ్ మాల్యాతో గానీ ఎలాంటి సంబంధం లేదు. నా జీవితంలో నేను ఎప్పుడూ ఒక చిన్న తప్పు కూడా చేయలేదు" అని ఆయన చేతులు జోడించి దీనంగా వేడుకున్నారు. కానీ ఆ మోసగాడు కనికరించలేదు, పైగా ఆయనపై ఒత్తిడి పెంచాడు. "కేవలం మనీ లాండరింగ్ మాత్రమే కాదు, మీ పేరు మీద ఇతర రాష్ట్రాలలో హత్య మరియు అత్యాచారం వంటి ఘోరమైన కేసులు కూడా నమోదై ఉన్నాయి. మీకు జైలు శిక్ష తప్పదు" అంటూ కొన్ని నకిలీ ఎఫ్.ఐ.ఆర్ పత్రాలను ఆయన మొబైల్‌కు పంపి మరింత భయభ్రాంతులకు గురిచేశాడు. అక్కడితో ఆగక, ఆ వృద్ధుడిని తన ఇంట్లోని ఒక గదిలోకి వెళ్లి లోపల నుండి తలుపులు వేసుకోమని ఆదేశించాడు. ఎవరికీ ఈ విషయం చెప్పకూడదని, చెబితే దేశద్రోహం కింద పరిగణిస్తామని బెదిరించాడు. దీనినే వారు 'డిజిటల్ అరెస్ట్' అని పిలిచారు. గంటల తరబడి వీడియో కాల్‌లోనే ఉండాలని, ఆయన కదలికలను తాము నిరంతరం గమనిస్తున్నామని భయపెట్టారు. "రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , ఆదాయపు పన్ను శాఖ మరియు సుప్రీం కోర్టు మీ ఆర్థిక స్థితిని పరిశీలిస్తాయి. మీ వద్ద ఉన్న పొదుపు సొమ్ము, ఫిక్స్‌డ్ డిపాజిట్లు మరియు పెట్టుబడులను మా ప్రత్యేక ఖాతాలకు బదిలీ చేస్తే, వాటిని విశ్లేషించిన తర్వాత మీరు నిర్దోషి అని తేలితే ఆ సొమ్మును తిరిగి ఇచ్చేస్తాము" అని నమ్మబలికాడు. తన సుదీర్ఘ కాలపు కీర్తి ప్రతిష్టలు ఎక్కడ మంటగలుస్తాయో అన్న ఆందోళనతో, ఆ వృద్ధుడు తన విజ్ఞతను కోల్పోయాడు. ఆ మోసగాళు చెప్పినట్లే సుమారు ఒక నెల రోజుల పాటు విడతల వారీగా మొత్తం 13 లావాదేవీల ద్వారా రూ. 1.27 కోట్లను వారు సూచించిన ఖాతాలకు బదిలీ చేశారు. అవి ఆర్‌బీఐ లేదా ఐటీ డిపార్ట్‌మెంట్ అధికారిక ఖాతాలని ఆయన బలంగా నమ్మారు. కానీ వాస్తవానికి అవి నేరగాళ్ల నెట్‌వర్క్ నిర్వహించే 'మ్యూల్ ఖాతాలు'. అప్పటికే ఆయన క్యాన్సర్ చికిత్స కోసం మానసిక ఒత్తిడికి గురవుతున్నారు, ఈ డిజిటల్ అరెస్ట్ ఆయనను మరింత కృంగదీసింది. తన ఆరోగ్యం కంటే పరువు ముఖ్యం అనుకున్న ఆ తండ్రి, తన కుమారులకు కూడా విషయం చెప్పకుండా రహస్యంగా ఉంచాడు చివరకు, ఆయన క్యాన్సర్ చికిత్సలో సహాయపడటానికి అమెరికా నుండి కుమారుడు పుణేకు వచ్చినప్పుడు అసలు విషయం బయటపడింది. తండ్రి ఎప్పుడూ గదిలోనే ఉండటం, ఫోన్ చూస్తూ భయపడటం మరియు ఎవరితోనూ మాట్లాడటానికి ఇష్టపడకపోవడం గమనించిన కొడుకు గట్టిగా నిలదీయగా, జరిగిన ఘోరం వెలుగులోకి వచ్చింది. అది ఒక భారీ సైబర్ స్కామ్ అని గుర్తించిన కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే పుణే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ స్వప్నాలి షిండే నేతృత్వంలో ఈ కేసు దర్యాప్తు ప్రారంభమైంది. నిందితులు విదేశీ సర్వర్లను మరియు నకిలీ గుర్తింపు కార్డులతో తెరిచిన బ్యాంక్ ఖాతాలను వాడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ప్రభుత్వం మరియు రక్షక భట నిలయాలు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, ఉన్నత విద్యావంతులు మరియు సమాజంలో గౌరవనీయ స్థానాల్లో ఉన్నవారు కూడా ఇలాంటి మోసగాళ్ల మాయలో పడటం శోచనీయం. చట్టబద్ధమైన ఏ ప్రభుత్వ సంస్థ, సీబీఐ లేదా ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు కూడా వీడియో కాల్ ద్వారా ఎవరినీ అరెస్ట్ చేయవని, నగదు బదిలీ చేయమని అడగరని అధికారులు పదేపదే హెచ్చరిస్తున్నారు. అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే బెదిరింపులకు లొంగకూడదని, తక్షణమే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. తన జీవితకాల కష్టార్జితాన్ని, పదవీ విరమణ తర్వాత వచ్చిన సొమ్మును ఒక సైబర్ మోసానికి కోల్పోయిన ఆ వృద్ధుడి ఉదంతం, డిజిటల్ ప్రపంచంలో మనం ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలిపే ఒక హెచ్చరిక. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు సాంకేతిక ఆధారాల సహాయంతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. (సి.హెచ్.ప్రతాప్)

# దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర రెండవ మహాసభలను జయప్రదం చేయండి

సీపీఐ రాష్ట్ర నాయకులు మేకల రవ




**విజేత హన్మకొండ జిల్లా బ్యూరోచీఫ్ :** దళిత హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం రాజ్యాంగ విలువల అమలుకు కట్టుబడి పనిచేస్తున్న దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర రెండవ మహాసభలు ఈ సంవత్సరం ఏప్రిల్ 17, 18 తేదీలలో నగరంలో ఘనంగా నిర్వహించబడనున్నాయని ఆహ్వాన సంఘం అధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర నాయకులు మేకల రవి తెలిపారు. శుక్రవారం శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలోవారు మాట్లాడుతూ దేశంలో దళితులపై జరుగుతున్న అణచివేతలు, దాడులు, వివక్షాత్మక చర్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కలలుగన్న సమానత్వ సమాజ నిర్మాణం ఇంకా పూర్తిగా సాధ్యం కాలేదని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్లు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కాకపోవడం వల్ల దళితులు అనేక రంగాల్లో వెనుకబడే పరిస్థితి కొనసాగుతోందన్నారు. ప్రభుత్వ రంగాల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, ప్రైవేట్ రంగం, విద్య, ఆరోగ్యం, ఉపాధి మరియు రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, భూ సమస్యలను పరిష్కరించేందుకు కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో నిర్వహించనున్న డిహెచ్‌పిఎస్ రాష్ట్ర రెండవ మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సుమారు 500 మంది ప్రతినిధులు, సామాజిక ఉద్యమ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొననున్నారని తెలిపారు. మహాసభల్లో దళితుల సమస్యలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు చెప్పారు. కాబట్టి రాష్ట్రంలోని దళితులు, ప్రజాస్వామ్యవాదులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర రెండవ మహాసభలను జయప్రదం చేయాలని మేకల రవి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు యేసు రత్నం, ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్మియా, సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘీ ఎలేందర్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు నిమ్మల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# విదేశీయులు భారతదేశానికి ఆదేశాలు ఇవ్వడానికి హక్కులేదు..!

ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి అంతర్జాతీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి..

అమెరికా భారత్‌కి తాను ఎక్కడి నుండి చమురు కొనుగోలు చేయాలో చెప్పే ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు.



**విజేత హన్మకొండ జిల్లా బ్యూరోచీఫ్ :** శుక్రవారం రోజున డా. ఖాద్రి మాట్లాడుతూ, భారత్ ఒక స్వతంత్ర సార్వభౌమ దేశమని, భారత్ ఎక్కడి నుండి చమురు కొనుగోలు చేయాలి లేదా ఎవరితో వాణిజ్యం చేయాలి అనే విషయాలను నిర్ణయించే హక్కు ఏ ఇతర దేశానికీ లేదని తెలిపారు. భారతదేశం యొక్క ఇంధన అవసరాలు ఆర్థిక ప్రయోజనాల గురించి తీసుకునే నిర్ణయాలు భారత ప్రజల ప్రయోజనాలను దేశ ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని మాత్రమే తీసుకోవాలని అన్నారు అమెరికా ఇతర స్వతంత్ర దేశాలపై ఒత్తిడి తెచ్చి వారి విధానాలపై ప్రభావం చూపాలని ప్రయత్నించడం అత్యంత ఆందోళనకరమైన విషయం అని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రపంచ రాజకీయాలలో శక్తివంతమైన దేశాలు అంతర్జాతీయ నిర్ణయాలపై ఆధిపత్యం చెలాయించడానికి మరియు అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక విదేశాంగ విధానాలను పరోక్షంగా నియంత్రించడానికి చేస్తున్న ప్రయత్నాల స్పష్టమైన ఉదాహరణ అని తెలిపారు. భారతదేశానికి గొప్ప స్వాతంత్ర్య సమర చరిత్ర ఉందని డా. ఖాద్రి గుర్తు చేశారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా భారత ప్రజలు దీర్ఘకాల పోరాటం చేసి స్వాతంత్ర్యం సాధించారని, ఆ పోరాటం కేవలం రాజకీయ స్వేచ్ఛ కోసం మాత్రమే కాకుండా దేశానికి సంబంధించిన అన్ని నిర్ణయాలను స్వయంగా తీసుకునే హక్కు కోసం కూడా జరిగిందని అన్నారు. ఆ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు మనకు దేశ సార్వభౌమత్వాన్ని స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యతను గుర్తు చేస్తున్నాయని చెప్పారు. భారతదేశం ఎక్కడి నుండి చమురు కొనుగోలు చేయాలి లేదా తన అంతర్జాతీయ సంబంధాలను ఎలా కొనసాగించాలి అనే ప్రశ్నలు వచ్చినప్పుడు, భారతదేశం తన జాతీయ ప్రయోజనాలు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని స్వయంగా నిర్ణయం తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో ఏ విదేశీ శక్తికీ భారతదేశానికి ఆదేశాలు ఇవ్వడానికి హక్కు లేదని అన్నారు,భారత ప్రభుత్వం ఏ విధమైన బాహ్య ఒత్తిడికీ లోనుకాకుండా దేశ సార్వభౌమత్వాన్ని, స్వతంత్ర విదేశాంగ విధానాన్ని జాతీయ గౌరవాన్ని కాపాడాలని డా. ఖాద్రి కోరారు. భారత్ ఎవరికి సేవకుడు కాదు. స్వాతంత్ర్య సమర వారసత్వంతో ఉన్న ఒక గౌరవనీయ దేశంగా భారత్ తన ప్రజల ఆశయాలు ప్రయోజనాల ప్రకారం ముందుకు సాగడానికి పూర్తి హక్కు కలిగి ఉందని తెలిపారు.

# వెలుగుమట్లలో అర్హులైన నిర్వాసితులకు ఇండ్లను నిర్మించి ఇవ్వాలి

పోటు రంగారావు,గుమ్మడిద

నరసయ్య,ఎం ఎల్ పార్టీ డిమాండ్.





**విజేత ఖమ్మం ప్రతినిధి :-** ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్లలో అర్హులైన నిర్వాసితులకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ నాయకులు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యేగుమ్మడి నరసయ్య పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు,వెలుగుమట్ల భూదాన భూముల, ఇండ్ల స్థలాల సాధన కమిటీ నాయకులు గుండా సత్యనారాయణ రెడ్డి జిల్లా కలెక్టర్ ను కలిసి శుక్రవారం వినతి పత్రం సమర్పించినారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ,వెలుగుమట్లలో గల 31 ఎకరాల భూమిలో 400 మంది పేదలు 2018 డిసెంబర్ నుండి నివాసం ఉంటున్నారని వారు కష్టపడి సంపాదించుకున్న డబ్బుతో పాటుగా వారి కుటుంబంలోని స్త్రీల పైన ఉన్న చిన్న చిన్న బంగారు ఆభరణాలు అమ్ముకొని కుదరబెట్టుకొని వడ్డీకి అప్పులు తెచ్చి వాటికి అవసరమైన డబ్బులు సమకూర్చుకొని ఇండ్లను నిర్మించుకుంటే, ప్రభుత్వ పోలీసు అధికారులు, జిల్లా యంత్రాంగం కలిసి, ఫిబ్రవరి 24 25 తేదీలలో ఎలాంటి విచారణ కానీ జరపకుండానే ఏ విధమైన నోటీసులు ఇవ్వకుండానే నిర్దాక్షిణ్యంగా కూల్చివేసిందని, ఇది దుర్మార్గమైన చర్య అని, పేదల గూడును చెదరగొట్టడం, వారిని దిక్కులేనివారుగా చేయడం రోడ్డున పడేయడం అనాథలుగా చేయడం ఇందిరమ్మ ప్రజా పాలన ఎలా అనిపించుకుంటుందని విమర్శించారు. ప్రభుత్వం ఒకవైపున ఇందిరమ్మ రాజ్యమంటూ, ప్రచారం చేసుకుంటూ ప్రగతి ప్రణాళిక విడుదల చేసి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను పేదలకు అందించామని ప్రచారం చేసుకుంటూ ఇంకొక వైపు పేదలు నివసించేటువంటి ఇండ్లను కూల్చివేయటం ఏ విధమైన ప్రగతి ప్రణాళిక అనిపించుకుంటుందని వారు విమర్శించారు వెలుగుమట్ల బాధితులు నేడు ఖమ్మం నగరంలో బిక్షమెత్తుకునే పరిస్థితిలో ఉన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కూల్చి వేయడం ద్వారా అక్కడ నివాసం ఉంటున్న 600 కుటుంబాలను తీవ్రమైన కష్టనష్టాలకు గురి చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్లు కూలిచిపోయే బడిన వారంతా కూడా పేదలనీ, 400 మంది కుటుంబాలలో ఎవరు ధనవంతులు గాని ప్రభుత్వ ఉద్యోగులు కానీ లేరని వారు తెలిపారు ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రభుత్వం నిబంధన ప్రకారం ఎవరికైనా గాని అర్హత లేకపోతే వారి ఇంటిని కూల్చివేసినందున నగదు రూపంలో నైనా నష్టపరిహారం చెల్లించడం న్యాయబద్ధమైనదని లేదా మిగిలిన వారితో పాటుగా వారికి కూడా ఇంటి స్థలం ఇందిరమ్మ ఇంట్లో కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు సి వై పుల్లయ్య, జి రామయ్య, ఆవుల అశోక్, వెలుగుమట్ల భూదాన భూముల ఇండ్ల స్థలాల సాధన కమిటీ నాయకులు వర్గాని కోటేశ్వరరావుసిరికొండ కళ్యాణి పోతురాజు ప్రశాంతి షేక్ జరీనా మేడి అనితనల్లబెల్లి కవిత నాగుల సుజాతవినుకొండ నాగరాజుపసుమర్తి రవి బొల్లు కోటేశ్వరరావుసిహెచ్ వినయ్వు రమేష్ డి నాగరా పసుమర్తి సతీష్ షేక్ సుభాని అజ్మీరా లింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

**విజేత ఖమ్మం ప్రతినిధి :** ఖమ్మం జిల్లా విద్యా రంగంలో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని, ట్రస్ట్ సమకూర్చిన పరీక్షల సామాగ్రి తొ క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ పదవతరగతిలో మంచిఫలితాలు సాధించాలని మర్లపాడు ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు పెన్మత్స భీమరాజు విద్యార్థులను కోరారు. శుక్రవారం నాడు మర్లపాడు ఉన్నత పాఠశాల పదవతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో భీమరాజు మాట్లాడుతూ పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ మన అభ్యర్థన మేరకు పదవతరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందజేయటం మన పాఠశాల కు గర్వకారణం అన్నారు. విద్యార్థులు ఖమ్మం జిల్లా చరిత్ర పుటల్లో మర్లపాడు గ్రామాన్ని నిలిచి పోయేలా చేయాలని కోరారు. అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగిన సమావేశంలో మధిర ఏయంసి ఉపఛైర్మన్ సాబిరాబేగం,అమ్మ ఆదర్శపాఠశాల ఛైర్మన్ నెల్లూరి నాగమణి, మాజీ సర్పంచులు ఎస్. నాగభూషణం, వి. పెద్దనాగిరెడ్డి, ఎస్, వెంకటరెడ్డి, గ్రామ పెద్దలు వీరాస్వామి, పి ధర్మారావు. పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖరరావు,రమాదేవి, వీరయ్య, సుదర్శనం, కోటారెడ్డి, రవి, సోని, రామకృష్ణ, నాగూర్సాహెబ్,విద్యార్థుల తల్లదండ్రులు పాల్గొన్నారు

# చేవెళ్ల సాక్షిగా మోసం చేసి,ఎస్సీ ఉద్యోగులతో సన్మానాలా.....?

కాంగ్రెస్ పాలనలో ప్రగతి కుంటుబడింది...

రాష్ట్రాన్ని దోపిడి చేసిన పొంగులేటి రాజీనామా చేయాలి....!

డా ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ బిఆర్ ఎస్ నాయకులు

**విజేత హన్మకొండ జిల్లా బ్యూరోచీఫ్ :** చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో ఎస్సీ ఎస్టీ ప్రజలను మోసం చేసి, ఈ రోజు ఏ ముఖం పెట్టుకొన్న శిల్పకళావేదికలో రేవంత్ రెడ్డి ఎస్సీ ఉద్యోగుల చేత సన్మానం చేయించుకుంటున్నారని డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎస్సీలకు ఏం చేశారో శిల్ప కళా వేదికగా ఎస్సీ ఉద్యోగులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 12 లక్షల ఆర్థిక సాయం,18 శాతం ప్రభుత్వ కాంట్రాక్టుల హామీలు ఏమయ్యాయో వివరణ ఇవ్వాలని రేవంత్ రెడ్డిని నిలదీశారు. శుక్రవారం రోజున హనుమకొండ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పేరుతో ప్రజల అటెన్షన్ డైవర్షన్ చేసే కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు.కాంగ్రెస్ పాలనలో ప్రగతే లేనప్పుడు,ప్రగతి ప్రణాళిక ఎందుకంటూ ఎద్దేవా చేశారు. రాంజీ నగర్ గ్యాంగ్ అటెన్షన్ డైవర్ట్ చేసి బంగారం ఎత్తుకోపోయినట్టు.. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా ప్రజల దృష్టి మరల్చే కార్యక్రమమే ప్రగతి ప్రణాళిక కార్యక్రమమని స్పష్టం చేశారు. రెండున్నరేళ్ల పాలనలో కాంగ్రెస్ ప్రజల దృష్టిని మార్చే ప్రయత్నమే చేస్తుంది.కాళేశవరం కూల్చి పిసి ఘోష్ కమీషన్ వేసింది. విద్యుత్ కుంభకోణం జరిగిందని చెప్పి, జస్టిస్ నరసింహారెడ్డి కమీషన్ వేసి కాలయాపన చేసింది,మొబిలిటీ వ్యాలీ పేరుతో రాష్ట్ర స్థాయిని పెంచాలని చూస్తే,కేటిఆర్ గారిపై ఫార్ములా ఈ రేస్ కేసు పెట్టారు.నీళ్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని నిలదీసినందుకు హరీష్ రావు పైన కేసులు పెట్టారు.ఫోన్ ట్యాపింగ్ కేసును సుదీర్ఘంగా ధారావాహిక లా కొనసాగిస్తున్నారు.ప్రభుత్వ అధికారులు ప్రతి చేసే పనులే, 99 రోజుల ప్రణాళికలో చేయాలని చెపుతున్నారు. సానిటేషణ్, పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయడం,పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం వంటి మొదలైనవి అన్ని అధికారులు రోజూ చేసే పనులు.అందుకె ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తుంది ప్రభుత్వం.కొత్తగా 99 రోజుల ప్రణాళికలో ఏముంది అని ప్రశ్నించారు.కాంగ్రెస్ పాలకులు ఇంకా పరిపాలన ఎలా చేయాలోనేర్చుకోవడంలేదన్నారు అధికారులందరూ పాలకుల చుట్టూ తిరిగేలా ప్రగతి ప్రణాళిక పేరుతో 99 రోజుల కార్యక్రమం రూపొందించారన్నారు.కాంగ్రెస్ ది ప్రజాపాలన కాదు,ప్రతీకార పాలన అంటూ మండిపడ్డారు. కేసిఆర్ పదేళ్ల పాలనలో అనేక విప్లవాత్మక పథకాలు పెట్టి ప్రగతి సాధించారు. ఆనాటి ప్రగతి గురించి దేశవ్యాప్తంగా చర్చించుకున్నారు. కళ్యాణలక్ష్మి, రైతు బంధు, మన ఈరు మన బడి,మిషన్ భగీరథ, దళిత బంధు, ఇలా ఎన్నో పథకాలు పెట్టారన్నారు మానుకోటలో రెవెన్యూశాఖ మంత్రి



పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి వచ్చారు.

**కొత్వాల్ గూడలో రాఘవ**

కన్ స్ట్రక్షన్స్ పేరుతో గుట్టలు నాశనం చేసి కంకర సప్లయ్ చేస్తూ,రాష్ట్ర వనరులను దోచుకుంటూ ప్రగతి గురించి మాట్లాడుతారా..? రాష్ట్రంలో ఇతర క్రషర్లకు వివిధ రకాలైన అనుమతులు లేవని అధికారులు నోటీసులు ఇస్తున్నారు, కానీ పొంగులేటికి చెందిన క్రషర్ కంపెనీలకు ఎందుకు ఇవ్వడంలేదన్నారు . రాఘవ కన్ స్ట్రక్షన్స్ పేరు రాసి ఉన్న కంటైనర్లకు... బిఆర్ఎస్ నాయకులు వస్తున్నారని రాత్రికి రాత్రే కలర్ వేసి తూడ్చే ప్రయత్నం చేశారు. పేర్లను తుడిచినట్టుగా,మీరు చేసిన దోపిడి తుడవలేరన్నారు. వెలుగుమట్లలో 2 వేల పేద కుటుంబాల ఇళ్లను కూల్చి రోడ్డు పై పడేశారు. 4 వేల మంది పోలీసుల సహాయంతో వెలుగుమట్లను గాజా గా మార్చారు. పేదలను పేయిడ్ బ్యాచ్,ల్యాండ్ మాఫియా అన్నారు.అలాంటి మీరు ప్రజా పాలన ప్రగతి గురించి మాట్లాడడం సిగ్గుచేటు అని,300 కోట్ల విలువైన భూమిని కబ్జా చేస్తే,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకును గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేస్తే సిఐ ను ట్రాన్స్ఫర్ చేశారని గుర్తుచేశారు.పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమ్మక్క సారక్క జాతర పనుల కాంట్రాక్టులు తీసుకొని నాసిరకం పనులు చేసి దోచుకున్నారని విమర్శించారు. భూ భారతి పేరుతో మీ సేవ కేంద్రంగా వందల కోట్ల దోపిడి జరిగిందని జనగామలో బయటపడిందని పేర్కొన్నారు. అందుకే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలి. ప్రగతి ప్రణాళిక గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదన్నారు. ఆగస్టు 26 2023లో చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో... మల్లిఖార్జున ఖర్గేను తీసుకొచ్చి ఎస్సీ,ఎస్టీలను లను మోసం చేశారు.ఆనాడు పూజా ఒడంబడిక పేరుతో బహుజన వర్గాలను మోసం చేసినట్టే, చేవెళ్ల పేరుతో ఎస్సీ ఎస్టీలను మోసం చేశారు.ఎస్సీలకు 12 రకాల హామీలు ఇచ్చారు.12 లక్షల ఆర్థిక భరోసా అన్నరు ఒక్క పైసా ఇవ్వలే. రాజీవ్ యువ వికాసం అప్లికేషన్లు తీసుకొని చెత్తబుట్ట వేశారు. ఎస్సీలకు ఇల్ల స్థలాలు ఇచ్చి, 6 లక్షలు ఇస్తామని చెప్పి,ఒక్కరికీ ఇవ్వలేదు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీలకు 18% కాంట్రాక్టలు ఇస్తామన్నారు. ఎంతమందికి ఇచ్చారు..? కేసిఆర్ హయాంలో వేల మంది ఎస్సీలు కాంట్రాక్టర్లు అయ్యారు. ప్రాజెక్ట్ ఇంప్లిమెంట్ యూనియన్ పేరుతో జీవో తెచ్చి కాంట్రాక్టులు పేదలకు రాకుండా దూరం చేశారు. ఈ రోజు అదే ఎస్సీ ఉద్యోగులతో శిల్ప కళా వేదికలో కృతజ్ఞత సభ పేరుతో ఎస్సీలతో సన్మానం చేయించుకుంటున్న రేవంత్ రెడ్డి,ఎస్సీ ఎస్టీలకు ఎన్ని కాంట్రాక్టులు ఇచ్చారో చెప్పాలి. ఎస్సీ కార్పొరేషన్ కింద పేదలకు 1500 కోట్లు రుణాలు ఇస్తామన్నారు.ఎంత మందికి రుణాలు ఇచ్చారో చెప్పాలి. అసైన్డ్,పోడు భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి,హైదరాబాద్ చుట్టుపక్కల ఎస్సీ భూములన్నీ రేవంత్ రెడ్డి బ్రదర్స్ కబ్జా చేస్తున్నారు. పీజీ చేస్తే లక్ష, పి హెచ్డి చేస్తే 5 లక్షలు ఇస్తామన్నారు,ఒక్క విద్యార్థికైనా ఇచ్చారా? ఒక్కరికీ ఇవ్వలే. 125 పైగా విద్యార్థులు గురుకులాల్లో చనిపోయేలా చేశారు. విదేశీ విద్యకు కేసిఆర్ ఇచ్చిన దానికంటే ఎక్కువ డబ్బు ఇస్తామన్నారు. మరో పక్క ఆకునూరి మురళితో గురుకులాలలను బంద్ చేస్తామని చెప్పిస్తున్నారు. ఆనాడు కేసిఆర్ వరంగల్ కు 4 గురుకుల డిగ్రీ కాలేజీలు తెచ్చారు.కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం గురుకుల డిగ్రీ కాలేజీలు వద్దు అంటుంది. ఫీజు రియంబర్స్ మెంట్ పథకాన్ని ఎత్తివేసి,ఎస్సీ ఎస్టీ బిసి పేద వర్గాల విద్యార్థులను కూలీలుగా తయారుచేయాలని కుట్ర చేస్తుందన్నారు.ఒక పక్క ఎస్సీ ఎస్టీలకు ద్రోహం చేస్తూ,మరోపక్క ఏ ముఖం పెట్టుకొని ఎస్సీ ఉద్యోగుల చేత శిల్పకళా వేదికలో ఈ రోజు సన్మానం చేయించుకున్నారని నిలదీశారు. వరంగల్ లో భద్రకాళి దేవాలయం వద్ద పేదలు హోటళ్లు పెట్టుకుంటే కుడా అధికారులు కూల్చేశారు. కానీ హైదరాబాద్ లో మల్లు రవికి అప్పనంగా 8 కోట్ల భూమిని అప్పగించారు. చెరబండరాజు కాలనీ వాసులను ఖాళీ చేపిస్తున్నట్టు,హైడ్రా అధికారులు ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతి రెడ్డి ఇంటిని ఎందుకు కూలగొట్టడంలేదు? ఖాజీపేటకు ఎన్నో సంవత్సరాల తర్వాత రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వచ్చింది.ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగం రాకుండా పోతే న్యాయం జరగదు.మహారాష్ట్ర లాతూర్ రైల్వే కోచ్ పెట్టి 70 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇచ్చారు.ఖాజీపేటలో ఎందుకు ఇవ్వరు?పివి నరసింహారావు ప్రధాని గా ఉన్నప్పటి నుండి ఇప్పటివరకు రాలేదు కానీ, కేసిఆర్ నాయకత్వంలో తెలంగాణ ఏర్పడి,పార్లమెంట్ లో కేంద్రంపై ఒత్తిడి తేవడం వల్ల రైల్వే కోచ్ సాధ్యమైంది. కేసిఆర్ 160 ఎకరాల భూమి ఇచ్చి రైల్వే కోచ్ ఏర్పాటుకు కృషి చేశారు. బిహార్ యుపి లో కంపెనీలు పెడితే స్థానికులకు ఉద్యోగాలు ఇస్తున్నారు. అక్కడివారికి ఇచ్చినట్టు ఇక్కడ కూడా ఇవ్వాలి.ఈ సమావేశంలో మాజీ కుడా చైర్మెన్ యాదవ రెడ్డి,కార్పొరేటర్లు ఇమ్మడి రాజు,జన్ను జకర్య,గబ్బెట శ్రీను, మంద శ్యాం, జంపన్న, చక్రి, సదాంత్, పూర్ణచందర్, ప్రశాంత్, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా చెరువు తూములు



బయట మెరుగులు బాగున్నా లోపల జంతు కళేబరాలతో దుర్వాసనతో కంపు.

మురికి నీరు కలుస్తుంటే చెరువు సుందరీకరణ ఎలా..?.

**విజేత, ఇబ్రహీంపట్నం :-** అసాంఘిక కార్యకలాపాలకు, అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్ గా ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు తూములు తయారయ్యాయి. రంగారెడ్డి జిల్లాలోని అతిపెద్ద చెరువులో ఒకటైన ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు, జిల్లాలోనే తలమానికంగా ఉంది, ఒకప్పుడు రాచకాలువ ఫిరంగి కాలువల ద్వారా షాబాద్ మండలం చందనవల్లి ప్రాంతం నుండి ఒక కాలువ, మరొకటి కడ్తాల్, కందుకూరు, మహేశ్వరం మీదుగా రావిరాల చెరువు మీదుగా ఇబ్రహీంపట్నం పెద్ద చెరువుకు వచ్చేవి, తద్వారా ఇబ్రహీంపట్నం చెరువు నిండుకుండలా మారినప్పుడు రైతులకు, మత్స్యకారులకు ఉపాధి దొరుకుతుండేది. కాలక్రమేనా 2003లో చెరువు ఎండినప్పుడు, పెద్ద, చిన్న తూములను రొండు కూడా మూసి వేయడం జరిగింది, రావిర్యాల నుండి వచ్చే కాల్వను మంగళపల్లి, శేరిగూడ, తట్టికాన ప్రాంతాల మీదుగా యాదాద్రి భువనగిరి జిల్లా రుద్రారం వద్ద మూసీలో కలిసేది, కానీ నీరు వచ్చే కాలువలు, తుమ్మల నుండి వెళ్లే నీరు రెండు మార్గాలు కూడా కబ్జాకు గురయ్యాయి. దీంతో 1200 మత్స్య కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి, వేలాది ఎకరాలకు నీరు అందకుండా పోయింది, కానీ గత కొద్ది కాలంగా చెరువులో నీరు ఉండడంతో కొంత భూగర్భ జలాలు పెరిగాయనే చెప్పవచ్చు, తాజాగా గత రెండు సంవత్సరాల నుండి ఇబ్రహీంపట్నం మున్సిపల్ బృందావన్ కాలనీ, కె.వి తండా, ఉప్పరగూడ, పోచారం, చర్ల పటేల్ కూడా, కర్లగూడ, ఎలిమినేడు తోపాటు కందుకూరు మండలానికి చెందిన మాదాపూర్, తిమ్మాపూర్



గ్రామాల నుండి వచ్చే మురుగునీరు నేరుగా ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో కలుస్తుంది. ఇక ఎఫ్టిఎల్ లో అనేక అక్రమాలు జరిగాయని పలుమార్లు మీడియా ద్వారా కథనాలు వచ్చినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హైడ్రా ఇబ్రహీంపట్నం చెరువుపై ప్రత్యేక దృష్టి సారించింది, సర్వేల వరకు మాత్రమే చేసి వదిలేసింది, హైడ్రా సర్వే ఎందుకు చేసిందో అనే అంశంపై స్థానిక ప్రజలలో తీవ్రస్థాయిలో చర్చనీయ అంశంగా మారింది. తాజాగా గత రెండు సంవత్సరాల క్రితం సార్వత్రిక ఎన్నికలలో 2023 డిసెంబర్ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా గెలుపొందిన మల్ రెడ్డి రంగారెడ్డి, ఎన్నికల హామీలు భాగంగా చెరువు సుందరీకరణ కోసం, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సుమారు 19 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. తూముల అలంకరణ, ఇనుప కడ్డీలతో ప్రతిష్టాత్మక డిజైన్లతో సుందరంగా ఏర్పాటు చేయడం జరిగింది, కానీ లోపల మాత్రం చెత్తాచెదారంతోపాటు, జంతు కళేబారాలతో, మద్యం సీసాలతో, దర్శనమిస్తుంది. జంతు కరేబరాలు మద్యం సీసాలతో దుర్గంధం వెదజల్లుతుంది. సమయంతో తేడా లేకుండా రాత్రింబగళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. అటు పోలీస్ శాఖ కానీ, మున్సిపల్, ఇరిగేషన్, రోడ్డు భవనాల శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు తీవ్రస్థాయి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైమెరుగులు దిద్దకుండా, కూలడానికి సిద్ధంగా ఉన్న, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిన, తూములను పరిరక్షించాలని స్థానిక నాయకులు కోరుతున్నారు.

**చెరువులో ఉన్న కంపచెట్ల మాటేమిటి...?.**

చెరువు సుందరీకరణ భాగంగా చెరువులో మునిగిన కంపచెట్ల తొలగింపు చేపడతారా లేదా అని సందేహం స్థానిక ప్రజలలో మత్స్యకారులకు చేపలు పట్టడానికి చెరువులోకి వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా పోయిందని ఈ కంపకు వలలు చిక్కుకొని పాడవుతున్నాయని, ముళ్ళు గుచ్చుకోవడం వల్ల చేపలు కూడా చనిపోతున్నాయని, అటు మురుగునీరు, ఇటు కంప చెట్లు వల్ల చేపల



మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తూ... మురుగునీరు కలవకుండా, కంపచెట్లను కూడా తొలగించాలని కోరుతున్నారు.

# ప్రతి కుటుంబం పరిశుభ్రతను పాటించాలి...!



భూపాలపల్లి శాసనసభ్యులు

గండ్ర సత్యనారాయణ రావు

**విజేత జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 3వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు 99 రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, డ్రైనేజీలు, కాలనీలు, ఇళ్ల పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని ప్రజలకు సూచించారు. గ్రామాలు మరియు పట్టణాల్లో విద్యుత్ సౌకర్యాలు, డ్రైనేజీ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు,మిడిల్ పోల్స్ అవసరం వంటి సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగ పడుతుందని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసి



విద్యుత్ సౌకర్యాలను మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. అలాగే విద్యార్థుల విద్య, హాస్టల్ సౌకర్యాలు మరియు ప్రజల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధులను ముందుగానే గుర్తించి తగిన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అన్ని శాఖల అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ వార్డులు, గ్రామాల అభివృద్ధికి భాగస్వాములు కావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్ కౌన్సిలర్లు, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పరీక్షలంటేే భయం వీడాలి..! అల్లాడి సురేష్



**విజేత మామడ:** ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ అల్లాడి సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున మండలంలోని పొన్కల్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ మరియు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. విద్యార్థులనుద్దేశించి వారు మాట్లాడుతూ... విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని వీడి ఏకాగ్రతతో చదివితే పరీక్షల్లో ఉత్తీర్ణులవడానికి అవకాశం ఉంటుందనీ,అలాగే ఒత్తిడిని తట్టుకోవడాని విలువైన సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మైస అరవింద్ కుమార్ , ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు .

# ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలి

ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి.


ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో వీధులు శుభ్రపరచిన ఎమ్మెల్యే.





**విజేత, ఇబ్రహీంపట్నం :-** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక (మార్చి 6 నుండి జూలై 12 వరకు) 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ప్రభుత్వ కార్యాలయల పరిశుభ్రత కార్యక్రమము కొంగరకలాన్ డివిజన్ -54 జిహెచ్ఎంసి గ్రంథాలయ కార్యాలయం నందు పరిశుభ్రత కార్యక్రమం వీధులు శుభ్రపరుచుట, డ్రైనేజీ క్లీనింగ్ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి హాజరై మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని ప్రజలకు ఇబ్బంది కలిగే సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తేవాలని సూచించారు. కొత్తగా రేషన్ కార్డులు తీసుకొని వారికి తీసుకునే విధంగా ఇందిరమ్మ ఇల్లు రాని వాళ్లకు వచ్చే విధంగా అందరికీ సహకరించాలని అధికారులకు సూచించారు. గృహ జ్యోతి కార్యక్రమంలో 200 యూనిట్లు కంటే తక్కువ ఉన్నవారికి ప్రతి ఒక్కరికి ఈ అవకాశాన్ని కల్పించాలని సూచించారు. ఇలాంటి స్కీములకు ప్రాధాన్యం ఇచ్చి ఎవరికైనా రాని వాళ్ళు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలందరూ పారిశుద్ధ్యం పాటిస్తే ఆరోగ్యం బాగుంటుందిని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అదనపు జిల్లా కలెక్టర్, ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి, ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఎస్డబ్ల్యూఎం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్లు, ఎస్డబ్ల్యూఎం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆదిభట్ల సర్కిల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోటగుళ్లు గణపేశ్వరునికి రూ. 20 వేలతొ పట్టు వస్త్రాల బహూకరణ



**విజేత, గణపురం :** గణపురం మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ గణపేశ్వరునికి మండల కేంద్రానికి చెందిన పింగిలి రమేష్ చందర్ రెడ్డి,సూర్యమ్మ, సాదన్ రెడ్డి, దీప్తి దంపతులు శుక్రవారం స్వామివారికి పట్టు వస్త్రాలను బహుకరించారు. ప్రతి సంవత్సరం ఏడాది మొత్తానికి సరిపడా పట్టు వస్త్రాలను దంపతులు అందజేస్తారు. మొదట స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నూతన పట్టు వస్త్రాలను ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారికి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయానికి పట్టు వస్త్రాలను అందజేసినరమేష్ చందర్ రెడ్డి, సూర్యమ్మ సాదన్ రెడ్డి, దీప్తి దంపతులకు కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# ప్రభుత్వ పాఠశాల ఆవరణలో చెత్త ను తొలగింపు



**విజేత,గణపురం :** గణపురం మండలం అప్పయ్య పల్లి గ్రామపంచాయతీ పరిధిలో 99 రోజుల ప్రజా ప్రణాళికలో భాగంగా గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని చెత్త ను పారిశుధ్య పనులను అప్పయ్య పల్లి సర్పంచ్ ఎలకపల్లి రమేష్ ఆధ్వర్యంలో వార్డు మెంబర్లతో కలిసి పాఠశాల ఆవరణము శుభ్రపరచడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చంద్రగిరి రాకేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీ నామ, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల





**విజేత ఖమ్మం ప్రతినిధి :** మధిర అసెంబ్లీ నియోజకవర్గం, ఎర్రుపాలెం మండలం బుచ్చిరెడ్డిపాలెం గ్రామ మాజీ సర్పంచ్ యరమల రేణుక--కృష్ణారెడ్డి దంపతుల కుమారుడు సాంబశివరెడ్డి వివాహం మధిర వాస్తవ్యులు శీలం కాశీ విశ్వేశ్వరరెడ్డి--పద్మ దంపతుల కుమార్తె శ్రావణితో మధిర వైరా రోడ్డులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నాడు ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ జడ్పీ చైర్మన్, మధిర అసెంబ్లీ ఇంచార్జి లింగాల కమల్ రాజు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి దాంపత్య జీవితం ఆనందంగా, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి బంధుమిత్రులు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యుత్ ఎర్తింగ్ వైర్ షాక్ తగిలి దూడ మృతి



**విజేత మామడ:** విద్యుత్ ఎర్తింగ్ తీగ తగిలి ఓ దూడ (గేదె) అక్కడికక్కడే మృతి చెందింది మండలంలోని పొన్కల్ గ్రామ రైతు గోనుగోప్పుల గంగన్నకు చెందిన దూడ శుక్రవారం ఉదయం ఇందిరమ్మ కాలనీలోని ట్రాన్స్ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు ఎర్తింగ్ వైర్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగి సుమారు నలభైవేల రూపాయల నష్టం వాటిల్లిందని ఎలాగైనా ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని విలపించారు.

## ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి కి వినతి పత్రం అందజేత

ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు లంక వెంకటేశ్వర్లు ఎల్ వి ఆర్ దళిత రత్న అవార్డు గ్రహీత.





**విజేత ఖమ్మం ప్రతినిధి :** తెలంగాణ ఎం ఆర్ పి ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగు లేటి శ్రీనివాసరెడ్డి కి వెలుగుమట్ల భూధాన్ భూముల ఇల్లు కోల్పోయిన నిరుపేద కుటుంబాలకు అర్హులను సర్వే చేసి వెంటనే ఇళ్ల జాగా మంజూరు చేసిన వంటి ఇళ్ల జాగాలో ఇందిరమ్మ ఇల్లు కట్టించిఇళ్ల ఇవ్వాలని. ఇల్లులు కూలగొట్టిన రోజున ఇంటిలో ఉన్న సామానులు ధ్వంసం అయినా కారణంగా ఒక్కొక్క ఇంటిలో ఎన్ని సామాన్లు అయితే పాడైపోయినవో అన్ని సామాన్లకు నష్టపరిహారం చెల్లించాలి అక్కడ ఉన్నటువంటి నిరుపేదలు గతంలో ఇళ్ల పట్టాలు ఇచ్చి వారి దగ్గర డబ్బులు తీసుకున్న వారి దగ్గర నుండి వారి దగ్గర నుండి తిరిగి ఆ నష్టపోయిన కుటుంబాలకు ఎన్ని డబ్బులు అయితే ఇచ్చారు రెట్టింపు డబ్బులు వారి దగ్గర నుండి మంత్రి పోలీసు వారు బాధ్యత తీసుకొని తిరిగి ఆ కుటుంబాలకు డబ్బులు ఇప్పించాలని. అలాగే పొంగి లేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి శ్రీహరి బాధ్యత తీసుకొని ఆ కుటుంబాలకు న్యాయం చేయాలని. ఈనెల 15వ తారీకు లోపు ప్రతి నిరుపేద కుటుంబాలకు న్యాయం చేస్తా అని ప్రకటించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి ధన్యవాదాలు తెలియజేస్తూ.. తమరు ఇచ్చిన 15వ తారీఖు లోపు పరిశీలించకపోతే 16వ తారీఖున అక్కడ నష్టపోయిన కుటుంబాలతో ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనారిటీల అన్ని కుల సంఘాలతో వివిధ పార్టీలతో ర్యాలీలు నిరాహార దీక్షలు చేస్తామని మంత్రిల కు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు లంక వెంకటేశ్వర్లు ఎల్.వి.ఆర్ దళిత రత్న అవార్డు గ్రహీత మహిళా మండలి అధ్యక్షురాలు మేళ్లచెరువు నాగమణి జిల్లా సీనియర్ నాయకులు పొట్ట పింజర వెంకటరత్నం సీనియర్ నాయకులు కుక్కల రాములు ప్రసాద్ హెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని వినతి పత్రం ఇవ్వడం జరిగినది.

## పరిమండల్ లో ఆయిల్ ఫామ్ అవగాహన సదస్సు




**విజేత, మామడ:** మండలంలోని పరిమండల్ గ్రామ రైతు వేదికలో ఆయిల్ ఫామ్ సాగుపై ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం రోజున రైతులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.రైతులు ఆయిల్ ఫామ్ పంట సాగులో తీసుకోవాల్సిన మెలుకవలు నీటిపారుదల మరియు ఎరువుల యాజమాన్యం, పురుగులు, తెగుళ్ళ నివారణ మరియు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించడం జరిగింది. తదనంతరం క్షేత్ర సందర్శన నిర్వహించి. నర్సరీ మొక్కల ఎంపిక నుండి గెలల కోత వరకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడం జరిగింది.కార్యక్రమంలో పసుపు పరిశోధన శాస్త్రవేత్త డా.విద్య, డివిజనల్ ఉద్యానవన అధికారి డా. మౌనిక,ఉద్యాన విస్తీర్ణ అధికారి దేవన్న, సర్పంచ్ జక్కుల లయ మల్లేష్ , ఆయిల్ పామ్ ఏరియా మేనేజర్ శశాంక్,క్లస్టర్ ఆఫీసర్ ప్రేమ్ సింగ్ మరియు ఆయిల్ ఫామ్ రైతులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి లబ్ధిదారుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు కృషి చేయాలి








రాష్ట్ర రెవెన్యూ సమాచార గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**విజేత, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** అర్హులైన ప్రతి లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు కృషి చేయాలి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుకు చేరేలా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై మహబూబాబాద్ ఐడీఓసి కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రికొండాసురేఖ,మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్సి రవీందర్ రావు, శాసన సభ్యులు మురళి నాయక్, దొంతి మాధవరెడ్డి, రాజేందర్ రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కూడా చైర్మన్ ఇనుగల వెంకట్రామిరెడ్డి, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ నెల 6వ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యా మరియు వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరతను తీర్చాలని, అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని చెప్పారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో కూడా వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి కొరత ఉండకుండా చూడాలని సూచించారు. ఉపయోగంలో లేని వైద్య పరికరాలను తొలగించి, అవసరమైన పరికరాలకు తగిన సిబ్బందిని నియమించి వాటిని సమర్థంగా వినియోగంలోకి తేవాలని పేర్కొన్నారు. పాఠశాలలవాహనాలు ఫిట్ నెస్ లేకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. జిపిఆర్ఎస్ ద్వారా పాఠశాల వాహనాలు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. స్లమ్ ఏరియాల్లో నివసిస్తున్న ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని, ఉందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి, ఎక్కడైనా నిధులు మంజూరు సమస్య ఉంటే నివేదికలు పంపాలని తెలిపారు. ప్రతి హస్టల్ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించి తనిఖీలు చేయాలని, విద్యార్థులతో కలిసి భోజనాలు చేయాలని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాభితా తయారు చేయాలని తెలిపారు. మార్చి నెలాఖరు వరకు ఇందిరమ్మ ఇండ్లు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని, గ్రౌండ్ కాని ఇండ్లు లబ్ధిదారుల నుండి అంగీకారాన్ని తీసుకుని రద్దు చేయాలని తెలిపారు. అనర్హులకు ఇండ్లు ఇస్తే కలెక్టర్లు భాద్యులు అవుతారని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో పాత ఇల్లు ఉన్న ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చెస్తే ఆటంకాలు కలిగించొద్దని అటవీ అధికారులను ఆదేశించారు. అటవీ, రెవెన్యూ భూ సమస్య పరిష్కారానికి సంయుక్తంగా సర్వే నిర్వహించి హద్దులు వేయాలని తెలిపారు. ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలలో సమస్య బాగా ఉందని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న పాత రహదారుల అభివృద్ధికి ఆటంకాలను కలిగించొద్దని స్పష్టం చేశారు. భూ భారతిలో ఇచ్చిన పట్టాలు, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. భూ భారతిలో అక్రమాలు జరిగితే సహించేది లేదని తెలిపారు. కలెక్టర్ల, ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ పెట్టొద్దని, రోడ్లు, కెనాల్, ఇతర అభివృద్ధి పనులకు భూ సేకరణ పూర్తి చేయాలని తెలిపారు.వినియోగంలో లేని పాత భవనాలను తొలగించాలని, ముక్యంగా పాఠశాలలు తొలగించి నూతన భవనాలు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. వినియోగంలో ఉన్న భవనాలకు రంగులు వేయాలని

**తెలిపారు. అర్హులైన మహిళలను**

మహిళ సంఘాలలో సభ్యులుగా చేర్చాలని తెలి పారు. మహిళల పథకాలకు సంబంధించి అన్ని పథకాలు ఈ 99 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో ఒక్కో ఎకో పార్కులు ఏర్పాటు చేయాలని, స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని ప్రతిపాదనలు ఇవ్వాలని తెలిపారు.

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కార స్థితిని దరఖాస్తుదారులు తెలుసుకునేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి సమాచారం వారి సెల్‌ఫోన్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలికల వసతి గృహాల్లో ఇన్సినిరేటర్లు ఏర్పాటు చేయాలని, మండల స్థాయిలో ఆరోగ్య సదస్సులు నిర్వహించి వైద్య పరీక్షలు చేపట్టాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఛైర్మన్‌లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.సమావేశంలో పాల్గొన్న కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ 99 రోజులు పాటు జరుగనున్న ప్రజాపాలన ...ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల రోజు వారి షెడ్యూల్ ను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వనోపాధి కల్పన కోసం అవగాహన సదస్సు అభ్యర్థుల ఎంపిక

జిల్లా పరిశ్రమల శాఖ

జనరల్ మేనేజర్ సిద్ధార్థ రెడ్డి



**విజేత,జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఎమ్మెస్ఎంఇ ఆధ్వర్యంలో జీవనోపాధిలా కల్పన కోసం అవగాహన సదస్సు మరియు ఆసక్తి గల అభ్యర్థుల ఎంపిక 35% సబ్సిడీ తో ఎంపిక చేసుకున్న యూనిట్ల మంజూరి. రేగొండ మండలం, తేదీ: 07-03-2026రేగొండ మండలంలోని రైతు వేదిక సమావేశ మందిరంలో 07-03-2026 శనివారం ఉదయం 10:00 గంటలకు జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో మరియు ఎన్ఐఎంఎమ్మెస్ఈ సహకారంతో మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి 18 నుండి 50 సంవత్సరాల లోపు వయస్సు గల మహిళలు మరియు పురుషులు, వివిధ రకాల వ్యాపారాలు ప్రారంభించాలనే ఆసక్తి కలిగిన వారు తమ ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో చిన్నతరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి అవకాశాలు, వివిధ వ్యాపార యూనిట్లు, నైపుణ్య శిక్షణలు మరియు బ్యాంకుల ద్వారా అందించే రుణ సౌకర్యాలపై పూర్తి వివరాలు తెలియజేయబడును. కార్యక్రమం అనంతరం ఆసక్తి గల అభ్యర్థుల వివరాలు సేకరించి, వారికి అవసరమైన శిక్షణలు అందించడంతో పాటు తగిన వ్యాపార యూనిట్లు ఎంపిక చేసుకోవడం,పనిముట్లు కొనుగోలు చేయడం మరియు బ్యాంకు రుణాల కోసం మార్గనిర్దేశం చేయబడుఅని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు, ఎస్ సి ఆర్ పి డి ఆర్ డి ఏఅసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్, కె.వి.ఐ.బి రిటైర్డ్ డైరెక్టర్ అశోక్, బ్యాంకుల ఎల్ఎండి, ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ సెల్ మేనేజర్ వెన్నెల, అసిస్టెంట్ మేనేజర్ నరేందర్ తదితరులు పాల్గొననున్నారు. కాబట్టి స్వయం ఉపాధి అవకాశాలు పొందదలచిన మహిళలు, పురుషులు మరియు వ్యాపారం ప్రారంభించాలనే ఆసక్తి గల అభ్యర్థులు ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరై ఈ అవకాశాన్నివినియోగించుకోవాలని ఒక ప్రకటనలు తెలిపారు.

# మృత్యుశకటాలుగా బాణాసంచా కేంద్రాలు





**విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:** కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో సంభవించిన ఘోర బాణాసం చా పేలుడు ఘటన తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించింది. ఒకే నిమిషంలో ముప్పైకి పైగా ప్రాణాలు గాలిలో కలిసిపోవడం, మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా చెల్లాచెదురుగా పడిపోవడం చూస్తుంటే అగ్నిప్రమాదాల తీవ్రత ఎంత భయంకరంగా ఉంటుందో అర్థమవుతోంది. ఈ విషాదం కేవలం యాదృచ్ఛిక ప్రమాదమా లేక భద్రతా ప్రమాణాల అమలులో వ్యవ స్థాపక వైఫల్యమా అన్న ప్రశ్న లు ఉత్పన్నమవు తున్నా యి.

**పునరావృతమవుతున్న పొరపాటు:**

ఇది మొదటి ఘటన కాదు. గతంలో ఉమ్మడి పశ్చిమ గోదా వరి జిల్లాలోని తాడేపల్లిగూడెం పరిధిలో కడియద్ద, జట్లపాలెం ప్రాంతాల్లో సంభవించిన పేలుళ్లలోనూ భారీగా ప్రాణనష్టం జరిగింది. ప్రతి సారీ ఘటన తర్వాత విచారణలు, తాత్కాలిక తనిఖీలు జరుగుతున్నప్పటికీ, కొద్ది నెలల్లోనే పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేట్లపాలెం ఘటన నేపథ్యంలో పొరుగునే ఉన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని తయారీ కేంద్రాల భద్రతపై ఇప్పుడు సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

**నిబంధనల ఉల్లంఘనే ప్రాణాంతకం:**

ప్రభుత్వ లెక్కల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 15 నుండి 20 తయారీ యూనిట్లు, 60కి పైగా హోల్‌సేల్ విక్రయ కేంద్రాలు ఉన్నాయి. అయితే, క్షేత్రస్థాయి పరిశీలనలో మెజారిటీ కేంద్రాలు కేవలం కాగితాల మీద మాత్రమే నిబంధనలు పాటిస్తున్నట్లు స్పష్టమవుతోంది. అనుమతికి మించి కార్మికులు: పది మందికి అనుమతి ఉన్న చోట 30 మందికి పైగా కార్మికులతో పని చేయించడం వేట్లపాలెంలో జరిగిన ప్రధాన తప్పిదం. పండుగలు, శు భకార్యాల సీజన్లలో లాభార్జనే ధ్యేయంగా సామర్థ్యానికి మించి కార్మికులను వినియోగిస్తున్నారు. రసాయనాల అక్రమ నిల్వ: సల్ఫర్, పొటాషియం నైట్రేట్ వంటి రసాయనాలను నిర్ణీత పరిమాణంలోనే ఉంచాలి. కానీ టన్నుల కొద్దీ మందుగుండును నిల్వ చేయడం వల్ల ప్రమాద తీవ్రత ఊహకందని విధంగా ఉంటోంది. నిర్మాణ లోపాలు: షెడ్ల మధ్య నిర్ణీత భద్రతా దూరం ఉండాలి. కానీ అనేక చోట్ల షెడ్లు గుట్టకట్టినట్టుగా నిర్మించారు. వేసవి తీవ్రత, ఎండల వల్ల రసాయనాలు వేడెక్కి పేలే ప్రమాదం ఉందని అగ్నిమాపక వర్గాలు భావిస్తున్నాయి.

**క్షేత్రస్థాయిలో చేదు నిజాలు:**

ఫీల్డ్ స్థాయిలో సేకరించిన వివరాల ప్రకారం భద్రత అనేది గాలికి వదిలేసినట్లు కనిపిస్తోంది ?అనేక కేంద్రాల్లో అగ్నిమాపక పరికరాలు మొరాయిస్తున్నాయి. కార్మికులకు కనీస రక్షణకు అవసరమైన గ్లౌజులు, మాస్కులు ఉండటం లేదు. పేలుడు పదార్థాలు, ముడిసరుకును వేర్వేరుగా ఉంచకుండా ఒకే చోట నిల్వ చేస్తున్నారు. ?అత్యవసర సమయంలో బయటపడే మార్గాలు లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. "లైసెన్స్ ఒకచోట.. తయారీ మరోచోట" అన్న చందంగా జనావాసాల మధ్య అక్రమంగా నడుస్తున్న చిన్నపాటి యూనిట్లే అసలు ముప్పుకి కారణం అవుతున్నాయి. వేట్లపాలెం పేలుడులో లైసెన్స్ ఉన్నప్పటికీ భద్రతను విస్మరించడం వల్లనే ఇంతటి నష్టం వాటిల్లింది. అధికారులు ఏటా లైసెన్సులను పునరుద్ధరిస్తున్నారా లేదా అన్నది ప్రశ్నార్థకం. ఈ ఘటనపై ప్రభుత్వం ఇప్పటికే అధికారులను సస్పెండ్ చేయడం పర్యవేక్షణ లోపాన్ని ఎత్తిచూపుతోంది. ??వేట్లపాలెం మారణహోమం నుంచి పాఠాలు నేర్చుకుని, జిల్లా యంత్రాంగం తక్షణమే మేల్కోవాలిసిన అవసరం ఎంతైనా ఉంది.

**డిజిటల్ మానిటరింగ్:**

లైసెన్స్ రిన్యూవల్, నిల్వ పరిమితులపై డిజిటల్ వ్యవస్థ ద్వారా నిరంతర నిఘా ఉంచాలి. నిల్వ సామర్థ్యం, కార్మికుల సంఖ్య, అగ్నిమాపక పరికరాల లభ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలి.

అక్రమ యూనిట్ల సీజ్: గ్రామీణ ప్రాంతాల్లో లైసెన్స్ లేకుండా నడిచే కుటీర పరిశ్రమలను గుర్తించి తక్షణమే సీజ్ చేయాలి.

శిక్షణ: పేలుడు పదార్థాలతో పనిచేసే కార్మికులకు తప్పనిసరిగా భద్రతా శిక్షణ ఇచ్చి, సర్టిఫికేషన్ చేయాలి.

**ముగింపు:** అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు కంటితుడుపు చర్యగా ఎక్స్‌గ్రేషియాలు ప్రకటించడం వల్ల పోయిన ప్రాణాలు తిరిగి రావు. లాభాల కోసం యజమానులు, పర్యవేక్షణలో అధికారులు రాజీ పడటం వల్ల సామాన్య కార్మికులు బలైపోతున్నారు. వేట్లపాలెం విషాదం మరోచోట పునరావృతం కాకుండా ఉండాలంటే, కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా తయారీదారులపై కఠిన చర్యలు అవసరం ఎంతైనా ఉంది. బాణాసంచా కేంద్రాలు మృత్యు కుంపట్లుగా మారకముందే ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకోవాలి.



# ఇంగ్లాండ్‌పై భారత్ ఘన విజయం

భారత్ ఫైనల్ కు అర్హత సాధించడం ప్రతి భారతీయుడికి గర్వకారణం

ఏ పి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి

**విజేత జీలుగుమిల్లి :** నేడు జరిగిన ఐసీసీ మెన్స్ టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన ఆటతీరును ప్రదర్శిస్తూ ఇంగ్లాండ్‌పై భారత జట్టు ఘన విజయం సాధించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి తెలిపారు. జట్టు సభ్యుల సమిష్టి కృషి, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో భారత్ ఫైనల్‌కు అర్హత సాధించడం ప్రతి భారతీయుడికి గర్వకారణమన్నారు. మైదానంలో ఆటగాళ్లు చూపించిన ధైర్యం, క్రీడాస్ఫూర్తి, నైపుణ్యం దేశ ప్రజలందరినీ ఉత్సాహపరిచాయని పేర్కొన్నారు. కఠినమైన పోటీలోనూ అద్భుత ప్రదర్శనతో విజయం సాధించిన భారత జట్టుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

**ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై విజయాన్ని అందుకోవాలి**

రాబోయే ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడబోతున్న భారత జట్టు మరింత ధైర్యంగా, సమన్వయంతో ఆడి మరో విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఆదివారం జరిగే ఫైనల్‌లో మన త్రివర్ణ పతాకాన్ని మరింత గర్వంగా ఎగురవేస్తూ ప్రపంచ కప్‌ను భారత్ గెలుచుకోవాలని ఆశిస్తూ జట్టు సభ్యులందరికీ హృదయపూర్వకంగా ఆల్ ది బెస్ట్ తెలిపారు. దేశం మొత్తం భారత జట్టు విజయాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తోందని, ఆటగాళ్లు చూపుతున్న ప్రతిభ యువతకు ప్రేరణగా నిలుస్తోందని అన్నారు. ఇదే ఉత్సాహంతో ఫైనల్‌లోనూ విజయం సాధించి దేశానికి మరో క్రీడా గౌరవాన్ని తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

# స్పందించిన మున్సిపల్ సిబ్బంది



**విజేత కాగజ్ నగర్ ప్రతినిధి :** కాగజ్ నగర్ పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి పక్కన తరచూ బురద నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్, పారిశుద్ధ సిబ్బంది స్పందించారు. నాలాను శుభ్రం చేసి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. అయితే, ప్రజలు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని కోరుతున్నారు. మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రతిరోజూ నాలాను పరిశుభ్రం చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.ది

# కాగజ్ నగర్లో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూమిపూజ



**అక్షర విజేత కాగజ్ నగర్ ప్రతినిధి :** కాగజ్ నగర్ పట్టణంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ జరిగింది. భీమవరంకు చెందిన పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీ త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో వేదమంత్రాలతో పూజలు నిర్వహించి, ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, మార్కెట్ వ్యాపారులు, ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వెంకటేశ్వర ఆలయ సేవా సమితి, శ్రీ భాష్యకార సేవ సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



# బైండోవర్ ఉల్లంఘనకు రూ.60 వేల జరిమానా



**అక్షర విజేత కాగజ్ నగర్ ప్రతినిధి :** కాగజ్ నగర్ పట్టణంలో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరికి రూ.60 వేల జరిమానా విధించారు. దేశీదారు అమ్ముతూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి తహశీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. అనంతరం మళ్లీ దేశీదారు విక్రయిస్తూ పట్టుబడటంతో తహశీల్దార్ మధుకర్ ఇద్దరికి రూ.60 వేల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు



**విజేత,చొప్పదండి :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని చొప్పదండి మండల కేంద్రంలో గుంటి స్వరూప శ్యామ్ ఏర్పాటు చేసినటువంటి మహిళా దినోత్సవ కార్యక్రమానికి చొప్పదండి శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కటింగ్ చేసి మహిళల శ్రమ, త్యాగం, శక్తిని అభినందిస్తూ మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత వైస్ చైర్ పర్సన్ పెరమండ్ల మానస, మున్సిపల్ కౌన్సిలర్ కొట్టే సునీత, వడ్లూరి అనుష, మండల, పట్టణ అధ్యక్షులు, ఏఎంసీ చైర్మన్ కొత్తూరు మహేష్ , వైస్ చైర్మన్ , కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్రె సత్య ప్రసన్నారెడ్డి, మండల ప్రెసిడెంట్ చిలుముల స్వప్న, సునీత, ప్రతిమ ఫౌండేషన్ ఇంచార్జ్ వంగ గీతారెడ్డి, సఖి కోఆర్డినేటర్ రేణుక మెప్మా ఆర్పీలు, ఐకెపి సభ్యులు వివో ఏలు, రెవెన్యూ ఆఫీసర్స్, ఆశా వర్కర్స్, అంగన్వాడి కార్యకర్తలు, బిఎల్ఓస్, పట్టణ మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పరిమి వెంకటేశ్వరరావు కు నివాళులర్పించిన మానవతా రాష్ట్ర కన్వీనర్



**విజేత దేవరపల్లి:** దేవరపల్లి గ్రామం నికి చెందిన ప్రముఖ వాణిజ్య వేత్త మరియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మాజీ అధ్యక్షులు పరిమి వెంకటేశ్వరరావు అకాల మరణానికి రాష్ట్ర మానవత కన్వీనర్ బలుసు సత్యనారాయణ శ్రద్ధాంజలి ఘటించినారు మరియు వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసినారు ఈ కార్యక్రమంలో జిల్లా మానవత శాంతి ర్యాలీ కమిటీ కన్వీనర్ గెద్దం సాయిబాబు, దేవరపల్లి మండల మానవత మాజీ అధ్యక్షులు ఈదుపుగంటి నాగేశ్వరరావు, యలమాటి సత్యనారాయణ, పరిమి శ్రీధర్, పరిమి వెంకటరత్నం, పరిమి శ్రీ రామకృష్ణ, మరియు పుర ప్రముఖులు, వ్యాపారవేత్తలు, ప్రజా ప్రతినిధులు, మానవత సభ్యులు పాల్గొన్నారు

# ప్రగతి ప్రణాళిక అమలులో ఉమ్మడి జిల్లాను ముందంజలో నిలుపుదాం







జిల్లా ఇంచార్జి మంత్రి ధనసురి అనసూయ సీతక్క

99 రోజుల ప్రణాళిక అమలుపై సన్నాహక సమావేశం

అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి

పాల్గొన్న ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి,షబ్బీర్ అలీ,ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ప్రగతి ప్రణాళిక అమలు కార్యాచరణను వెల్లడించిన కలెక్టర్లు ఇలా త్రిపాఠి, ఆశిష్ సంగ్వాన్

**విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక అమలులో నిజామాబాద్,కామారెడ్డిలతో కూడిన ఉమ్మడి జిల్లాను ముందంజలో నిలపాలని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసురి అనసూయ సూచించారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక అమలుపై నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా విచ్చేసి, ఉమ్మడి జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేయగా ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్ రెడ్డి,?మహమ్మద్ షబ్బీర్ అలీ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఇలా త్రిపాఠి, ఆశిష్ సంగ్వాన్ లు ప్రగతి ప్రణాళిక అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక గురించి ఆయా శాఖలు, అంశాల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా ఇంచార్జి మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ పల్లెలు, పట్టణాల సమగ్ర అభివృద్ధి కోసం, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా ప్రభుత్వం ఆయా శాఖల వారీగా పరిసరాల పరిశుభ్రత. ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్.. అలైవ్, సంక్షేమం, పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట, రైతు సంక్షేమం.. వ్యవసాయం, విద్య, యువత.. క్రీడలు, మహిళలు, పర్యావరణం అంశాలలో నిర్దేశిత లక్ష్యం మేరకు ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా విజయవంతం అయ్యేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉద్యోగులు ప్రగతి ప్రణాళిక అమలులో క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేస్తూ ప్రజలకు జవాబుదారీగా పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ ప్రణాళిక అమలు ద్వారా రానున్న మూడు నెలల వ్యవధిలో ప్రజారోగ్యం, విద్య, వైద్యం, అంగన్వాడీల నిర్వహణ, స్త్రీ శిశు సంక్షేమం, పారిశుద్ధ్యం తదితర అంశాలలో స్పష్టమైన మార్పు కనిపించేలా అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాలలో బాల్య వివాహాలు వంటి సామాజిక రుగ్మతలను దూరం చేసేందుకు, డ్రగ్స్, కల్తీకల్లు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, వాటి నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఇంచార్జి మంత్రి ఆదేశించారు. అంగన్వాడి,గ్రామ పంచాయతీ, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించాలని, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలపై గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతి ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కొనసాగిస్తున్న ఆదర్శ పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకెళ్లడమే లక్ష్యంగా, అధికారులు సమన్వయంతో పని చేసి ఈ ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలని మంత్రి ధనసురి అనసూయ అధికారులను కార్యోన్ముఖులను చేశారు. ఈ కార్యక్రమం పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను వినియోగించాలని ఉమ్మడి జిల్లా అధికారులకు సూచించారు. ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ మాట్లాడుతూ ప్రగతి ప్రణాళిక అమలులో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలతో కూడిన అంశాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను ప్రజలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా అవగాహన పెంపొందించాలని సూచించారు. అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయిస్తూ, రోడ్ల మరమ్మతులు, రెవెన్యూ సంబంధిత అంశాల అనుమతుల జారీ వంటి వాటిపై దృష్టిని కేంద్రీకరించాలని అధికారులను కోరారు. వేసవిలో ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగానే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. కేంద్రం ద్వారా సమకూరే నిధులతో చేపట్టాల్సి ఉన్న పనులను సకాలంలో పూర్తి చేయించేలా చొరవ చూపాలని, తద్వారా నిధులు మురిగిపోకుండా, వెనక్కి మళ్లిపోకుండా పూర్తి స్థాయిలో సద్వినియోగం అయ్యేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నిజామాబాద్ నగర మేయర్ కే.ఉమారాణి, నుడా చైర్మన్ కేశ వేణు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య, కామారెడ్డి ఎస్.పీ రాజేష్ చంద్ర, నిజామాబాద్ అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఎఫ్ఓ లు వికాస్ మీనా,నిఖిత,ఏసీపీ చైతన్య రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన అన్ని శాఖల అధికారులు, మున్సిపల్ చైర్ పర్సన్ లు, తదితరులు పాల్గొన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముగ్గురు దివ్యాంగులకు మంత్రి సీతక్క చేతుల మీదుగా ల్యాప్ టాప్ లు అందజేశారు.

**మినీ సరస్ ఫెయిర్ -2026 ను ప్రారంభించిన మంత్రి సీతక్క**

జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ??సెర్ప్??నాబార్డు ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ సరస్ ఫెయిర్ -2026ను ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి,ఎమ్మెల్యే భూపతిరెడ్డి,కలెక్టర్ ఇలా త్రిపాఠిలతో కలిసి జిల్లా ఇంచార్జి మంత్రి ధనసూరి అనసూయ సీతక్క లాంచనంగా ప్రారంభించారు. గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన ప్రదర్శన, విక్రయ స్టాళ్లను తిలకించారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. మహిళా ప్రగతి-తెలంగాణ ఉన్నతి అనే నినాదానికి కట్టుబడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల ఆర్థిక అభ్యున్నతికి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగానే వడ్డీ లేని రుణాల పంపిణీ,ఉచిత ప్రమాద బీమా, లోన్ బీమా, ఆర్టీసీలో అద్దె బస్సులు,పెట్రోల్ బ్యాంకులు,సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. వచ్చే మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల కోసం తమ ప్రభుత్వం మరిన్ని కొత్త పథకాలను ప్రవేశపెట్టనుందని మంత్రి వెల్లడించారు. మహిళలు ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజిరెడ్డి,డీ.ఆర్.డీ.ఓ సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వినాయక నగర్ లోని విజయలక్ష్మి గార్డెన్స్ లో నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా సాధికారత కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. నిజామాబాద్ పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి ధనసూరి అనసూయ సీతక్కకు ఆర్ అండ్ బీ అతిథి గృహం వద్ద కలెక్టర్ ఇలా త్రిపాఠి,ఇతర జిల్లా అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు.

# మహిళలకు అవకాశాన్ని ఇవ్వండి . . . . సమాజ అభివృద్ధిని పొందండి



తెలంగాణ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ స్త్రీ సంక్షేమ శాఖ మంత్రి ధన సూరి సీతక్క






**విజేత :** మహిళలకు అవకాశాలు ఇవ్వటం ద్వారా సమాజ అభివృద్ధికి తోడ్పడతామని తెలంగాణ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు ధనసురి సీతక్క అన్నారు. శుక్రవారం స్థానిక విజయలక్ష్మి గార్డెన్లో ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మహిళా సాధికారతకు అవగాహన సదస్సును నిర్వహించారు. ముందుగా ముఖ్య అతిథులతో జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం వందేమాతర గీతాన్ని ఆలపించి సభను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు సీతక్క పాల్గొని మాట్లాడుతూ 1911లో కమ్యూనిస్టు నాయకురాలు జంక్షన్ అన్న ఉన్న మహిళల అసమానత్వాన్ని నివారించుటకు పోరాటం చేశారన్నారు. దాన్ని పురస్కరించుకొని మార్చి 8 ని అంతర్జాతీయ మహిళా దినోత్సవం గా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా కొన్ని నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందనీ అందులో భాగంగా 2026 సంవత్సరానికి గాను "గివ్ టు గైన్" అన్న నినాదాన్ని తీసుకోవడం జరిగిందని అన్నారు. మహిళలకు సమాన అవకాశాలను ఇచ్చినట్లయితే వారి నుండి సమాజ అభివృద్ధికి ఎంతో పొందుతామని అర్థాన్నిస్తుందని దానికి అనుగుణంగానే ఐక్యరాజ్యసమితి ఇచ్చిన పిలుపుమేరకు మనందరం మహిళలకు ఆ అవకాశాలను ఇవ్వటమే కాకుండా వారికి బాసట గా నిలుద్దామని పేర్కొన్నారు. మహిళా సాధికారత సాధించడంలో లింగ విభేదాన్ని విడనాడాలని??గివ్ టు గైన్ అన్న నినాదాన్ని సార్థకత చేసుకుంటూ సమాజంలోని ప్రతి ఒక్కరూ మహిళా సాధికారతకు పాటుపడదామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తన జీవితాన్ని ఒక ఉదాహరణగా ఆదర్శవంతమైన మహిళగా తీర్చి దిద్దుకొనుటకు చదువు ఎంతో ఉపయోగపడిందని మహిళా అభ్యున్నతికి విద్య ఎంతో తోడ్పడుతుందని అన్నారు. చదువు విజ్ఞానాన్ని ఇస్తుందని ఈ విజ్ఞానంతో సమాజంలో రాణిస్తామని అన్నారు. ప్రతి విద్యార్థిని ఒక ఆదర్శవంతమైన వ్యక్తిని ఆదర్శంగా తీసుకొని సంపూర్ణ వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవటానికి వారి జీవిత చరిత్ర చదివి ఆ అభివృద్ధి వైపుగా అడుగులు వేయాలని తెలిపారు. ప్రతి మహిళ కంపాషన్,కమిట్మెంట్,అండ్ కరేజ్ ను కలిగి ఉండాలని,చాలెంజ్ లేని జీవితం చప్పడి కూర వంటిదని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ఆధారంగా నేను నా జీవితాన్ని గొప్పస్థాయిలో మలుచుకోగలిగినాని తెలిపారు. పదవ తరగతి చదువుతూ విప్లవోద్యమంలో వెళ్లిన నేను ఒక నక్సలైట్ గా ఏ కోర్టులో నిలుచున్నానో అదే కోర్టులో నేను అడ్వకేట్ గా నిలిచి నా గురుతుల్యులు అయినటువంటి వెంకటస్వామి రెడ్డి నీ ఆదర్శంగా తీసుకుని వారి ఆధ్వర్యంలో అదే కోర్టులో నిర్దోషిగా నిలబడగలిగానని అన్నారు. మహిళగా సమాజంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూనే సమస్యలను అధిగమించేలా ఉండాలని ఆత్మస్థైర్యము , ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. చదువు, క్రమశిక్షణతో మనం మనంగా నిరూపించుకోవాలని అది చదివైనా, పని అయినా ఏ రంగంలోనైనా మనంగా నిరూపించబడాలని అన్నారు. ఓటమి అనేది విజయానికి నాంది అన్న నానుడిని ఆదర్శంగా తీసుకోవాలని అబ్రహం లింకన్, మదర్ తెరిసా, మేరీకాన్ లాంటి ఆదర్శవంతమైన వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని మన అభివృద్ధికి అడుగులు వేయాలని అన్నారు. నేడు మహిళా సాధికారతకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా అనేకమందికి జీరో వడ్డీ రూపేనా రుణాల అందిస్తూనే అనేక మందిని గొప్ప వ్యాపారవేత్తలుగా కోటి మందిని మహిళా వ్యాపారవేత్తలుగా చేయటమే లక్ష్యంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో 15 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు మహిళా సంఘాలలో సభ్యత్వాలను కల్పించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు కి ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ చైర్మన్ పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య మాట్లాడుతూ సమాజంలోని మహిళల విజయాలను యువతగా మీకు పరిచయం చేయాలన్న లక్ష్యంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా చైతన్యవంతమైన యువతకి అందించాలని లక్ష్యంతో సమాజంలోని చీడపీడలైన డ్రగ్స్ వంటి మహమ్మారిపై అవగాహన కల్పించాలని నేటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. నిజామాబాదు వ్యవసాయ ఆధారిత జిల్లాగా వ్యవసాయము వాణిజ్యము వైద్య పరంగా జిల్లాపై చుట్టుపక్కల ఉన్న జిల్లాలు ఆధారపడి ఉన్నాయని అలాంటి పరిస్థితుల్లో భద్రత కల్పించాలని ఆ భద్రత లో భాగంగా భద్రత, ట్రాఫిక్ భద్రత, సైబర్ భద్రత తదితర విషయాలపై యువతకు అవగాహన కల్పించి చైతన్యవంతులుగా చేయటమే నేటి కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఈ సందర్భంగా నిజామాబాదు సెక్యూరిటీ కౌన్సిల్ బొచర్లను విడుదల చేశారు. "సురక్ష దీప్" అన్న భద్రతా బోర్డులను ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో ఏర్పాటు చేయాలని ఈ "సురక్ష దీప్" ప్రతి మహిళకు వారి సమస్యల పరిష్కారానికి ఒక భద్రతను కల్పించే దిశగా పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నిజామాబాద్ మేయర్ కె.ఉమారాణి, నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ కన్వీనర్ డిసిపి(అడ్మిన్ ) జి. బస్వా రెడ్డి, ట్రెజరర్ కే.సంతోష్ కుమార్,ప్రధాన కార్యదర్శి కవిత రెడ్డి , ఎన్.ఎస్.సి సభ్యులు కాకతీయ కాలేజ్ రజినీకాంత్, కామారెడ్డి ఏసిపి చైతన్య రెడ్డి, కామారెడ్డి డి.ఎఫ్.ఓ నిఖీత, నుడా చైర్మన్ కేశ వేణు, వివిధ కళాశాలకు చెందిన విద్యార్థిని లు తదితరులు పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రజా పాలనా--ప్రగతి ప్రణాళికకు శ్రీకారం

ప్రజలకు పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ

జోనల్ కమిషనర్ మంద మకరందు




**విజేత రాజేంద్రనగర్ :** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ జోనల్ పరిధిలోని అత్తాపూర్ సర్కిల్ కార్యాలయంలో 99 రోజుల ప్రజా పాలనా--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మొదటి రోజున ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మంద మకరందు, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి, అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెత్త డబ్బాల్లోనే వేయాలని ప్రత్యేకంగా తడి పొడి వేరువేరుగా చేసి సిబ్బందికి ఇబ్బంది కాకుండా చేసుకోవాలని జోనల్ కమిషనర్ మంద మకరందు సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజల ఆరోగ్యం కాపాడబడుతుందని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు కాలనీలు, రహదారులు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన అన్నారు. ప్రజా పాలనా--ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేస్తారని తెలిపారు. పరిశుభ్రత కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు కూడా చురుకుగా పాల్గొని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.అనంతరం అక్కడికి వచ్చిన సిబ్బందితో కలిసి అధికారులు పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా బాధ్యతగా వ్యవహరిస్తామని అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉన్నత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గెలుపు గర్వంతో ముందుకు వెళ్తే భవిష్యత్తు రాజకీయం అంధకారమవుతుంది







ఆత్మీయ అభినందన సభ లో మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేంధర్

**విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు హుందాగా వ్యవహరించాలని, గెలుపు గర్వంతో ముందుకు వెళ్తే భవిష్యత్తు రాజకీయం అంధకారమవుతుందని మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేంధర్ అన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన బీజేపీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు నగర శివారులోని కమ్మ సంఘంలో శుక్రవారం ఆత్మీయ అభినందన సభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేంధర్,?ఎంపీ ధర్మపురి అర్వింద్,అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసినప్పుడే రాజకీయ నాయకులకు గుర్తింపు వస్తుందన్నారు.రాజకీయ చరిత్రలో రైతులతో పెట్టుకున్న ఏ పార్టీ కూడీ బ్రతికి బట్ట కట్టలేదని,గెలుపు గర్వంతో కాకుండా ప్రజా సేవకే అంకితమవ్వాలని అన్నారు. ఒకప్పుడు బీఆర్ఎస్ విర్రవీగిన తనంతో ముందుకు వెళ్లిందన్నారు. ప్రజలు, రైతులను పట్టించుకోకుండా అహంకారపూరిత పాలన చేసిందన్నారు. తాను అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన సమయంలో ప్రతి పక్షంలో ఉన్న డీఎస్ మాట్లాడుతూ ఒకప్పుడు తన రాజకీయ గురువైన అర్గుల రాజారాం ఆర్థిక మంత్రిగా ఉన్నపుడు ప్రవేశపెట్టిన బడ్జెట్ తో ఈటెల బడ్జెట్ పోలి ఉందని కితాబునిచ్చారన్నారు. ప్రతి పక్షంలో ఉన్నప్పటికీ డీఎస్ హుందాతనం ప్రదర్శించేవారన్నారు. ప్రతిపక్షం అంటేనే విమర్శించడం కాదని, అధికార పక్షం అంటే అధికారం మాత్రమే చూపడం మాత్రమే కాదన్నారు. అనంతరం ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ హుందా రాజకీయాలు ఇందూర్ పార్లమెంట్ ను చూసి నేర్చుకోవాలని అన్నారు. తెలంగాణ మొత్తంలో నిజామాబాద్ లోనే అత్యధిక కార్పొరేటర్ కౌన్సిలర్ సీట్లు బీజేపీ గెలిచిందని స్పష్టం చేశారు. తాము ఎవరిని కొనుక్కొని రాజకీయాలు చేయమన్నారు. హిందువులలో అత్యధిక కార్పొరేటర్ సీట్లను తాము గెలిచామని,మిగిలిన వాటిని కాంగ్రెస్, ఎంఐఎం కుమ్మక్కై మేయర్ సీటును కైవసం చేసుకుందన్నారు. అంతే కానీ ప్రజల ఆశీర్వాదంతో మేయర్ సీటును అందుకోలేదన్నారు. తాము ప్రజాస్వామ్య బద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. గతంలో బీఆర్ఎస్ కూడా ఇలాగే చేసిందని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీలో కూడా రోజులను తగ్గించడం, ప్రశ్నించే వారిని అణగదొక్కడం చేసిందన్నారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో నూ బీజేపీ తన సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ రాష్ట్రంలోనే ఇందూర్ పార్లమెంటు పరిధిలో అత్యధిక ఎమ్మెల్యేలను గెలిపిస్తానని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా హుందాగా ఉండే నాయకుల్లో ఎంపీ ఈటల రాజేందర్ ఒకడని కొనియాడారు. అనంతరం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ మాట్లాడుతూ గెలుపొందిన కార్పొరేటర్లు కౌన్సిలర్లు ప్రజలతో మమేకం అవ్వాలని అన్నారు. నిత్యం అభివృద్ధి కోసం ఆలోచన చేయాలని దీంతో ప్రజల చేయూత ఎప్పటికీ ఉంటుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి మాట్లాడుతూ ఇటీవల ఎంపీ అర్వింద్ భవిష్యత్తులో మేయర్ పీఠాన్ని తాము కైవసం చేసుకుంటామని చెప్పారని గుర్తు చేశారు. ఎంపీ ఏదైనా మాట్లాడితే ఖచ్చితంగా చేసి తీరుతారని దానికి ఒక అర్థం ఉంటుందని తెలిపారు. రాబోయే ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించుకుని జిల్లా పరిషత్ చైర్మన్ కైవసం చేసుకుంటామన్నారు. మరో ఎక్స్ అఫీషియో ఓటు బీజేపీకి వస్తుందని అలాగే మరో ఎమ్మెల్సీ స్థానం కూడా ఖాళీ అవుతుందని అది కూడా బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు. అనంతరం నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో గెలుపొందిన కౌన్సిలర్లు, కార్పొరేటర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, జిల్లా ప్రబారి కాంతారావు, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, కార్యవర్గ సభ్యులు భోగ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి...విద్యాశాఖలో కీలక పాత్ర...!

ఎస్సి వర్గీకరణకు చట్టబద్దత కల్పించిన మొదటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి....

30ఏళ్లుగా నలుగుతున్న వర్గీకరణ సమస్యకు పరిష్కారం తీసుకొచ్చిన సి ఎం...

డా.ఎంపి కడియం కావ్య

కొంత మంది సీఎం ను విమర్శించే ప్రయత్నం చేస్తున్నారు...

సిఎం మేలును మర్చిపోని గొప్ప జాతి మాదిగ, మాదిగ ఉప కులాల జాతి.....

నాణ్యమైన విద్యను అందిస్తే దళిత బిడ్డలు ఎవరికీ తీసిపోరు...

సమాన అవకాశాలు కల్పిస్తే ప్రతీ ఒక్కరూ మట్టిలో మాణిక్యంలా ఎదుగుతారు.....

ఎమ్మెల్యే కడియం శ్రీహరి







**విజేత హన్మకొండ జిల్లా బ్యూరో ఛిఫ్ :** హైదరాబాద్ లోని శిల్పకళ వేదికలో ఎస్సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశంలోనే మొట్ట మొదటి సారిగా వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన సీఎం రేవంత్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ....30ఏళ్ల పోరాటం తర్వాత సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సి వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించినదేశంలోనే మొట్ట మొదటి ముఖ్యమంత్రి మన రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న సమస్యకు పరిష్కారం కనుగొనాలనే అందరిని ఒప్పించి వర్గీకరణకు చట్ట బద్ధత తీసుకువచ్చారని అన్నారు. అయినప్పటికీ సీఎం గారిని కొంత మంది విమర్శలు చేస్తున్నారని తెలిపారు. మాదిగ, మాదిగ ఉప కులాలను ఒక గొప్ప తనం ఉందని, సహాయం చేసినా, మేలు చేసిన మర్చిపోమని అన్నారు. సభ్యత సంస్కారం ఉన్నా జాతి మాదని అన్నారు. చెడు చేస్తే ఎదురు తిరుగుతామని, మంచి చేస్తే ఎత్తుకొని తిరుగుతామని తెలిపారు. ఏ ప్రభుత్వాలు, ఏ ముఖ్యమంత్రి మంచి చేస్తున్నారో ఆలోచన ఉండాలని, కొంత మంది వాళ్ళ స్వార్థం కోసం తప్పు దారి పట్టించే ప్రయత్నం చేస్తారని వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు ముఖ్యమంత్రి విద్యా శాఖ మంత్రిగా ఉన్నారని రాష్ట్రంలో ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తూ వెనకబడిన తరగతుల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్న రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం పేద వర్గాల సంక్షేమనికి పెద్ద పీట వేయాల్సిన అవసరం ఉందని అన్నారు. పేద వర్గాలకు కావాల్సింది విద్యా, వైద్యం, సంక్షేమం అని ప్రభుత్వం వాటి పై దృష్టి పెడితే అంబేద్కర్ అందించిన రిజర్వేషన్లు, మీరు అందించిన వర్గీకరణను ఆసరాగా చేసుకొని ముందుకు వెళ్తామని తెలిపారు. నాణ్యమైన విద్యను అందిస్తే దళిత బిడ్డలు ఎవరికీ తీసిపోరని స్పష్టం చేశారు. మనం అందించే విద్యలో అసమానతలు ఉంటే సమాజంలో కూడా అంతరాలు ఏర్పడుతాయాని వెల్లడించారు. ఒకప్పుడు సామజిక, ఆర్థిక అసమానతలు ఉంటే ఇప్పుడు విద్యలో అసమానతలు ఏర్పడుతున్నాయని అన్నారు. దీనివల్ల మళ్ళీ మా జాతి వెనకబడే అవకాశాలు ఉన్నాయని అన్నారు. మా జాతి అందరితో సమానంగా ఎదగాలంటే నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలని తెలిపారు. విద్య అందించడం కాదు నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులో ఉంచాలని కోరారు. తెలివి ఎవరి సొత్తు కాదని... అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తే ప్రతీ ఒక్కరూ మట్టిలో మాణిక్యంలా ఎదుగుతారని వెల్లడించారు. విద్య అంటే భవనాలు, ఉపాధ్యాయులు మాత్రమే కాదని విద్య అంటే విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రభుత్వం, ఉపాధ్యాయులే విద్యకు మూల స్తంభాలని తెలిపారు. దళిత సంక్షేమం, విద్యా రంగ అభివృద్ధికి మీ సంకల్పం తోడైతే తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తుందని పేర్కొన్నారు.

# నాదెండ్ల గ్రామంలో ఘనంగా ఎంఆర్‌పిఎస్ జెండా ఆవిష్కరణ

## ముఖ్య అతిథిగాఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ

**విజేత నాదెండ్ల :** నాదెండ్ల మండల కేంద్రంలో ఎంఆర్‌పిఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ముఖ్య అతిథిగా విచ్చేసి, సంఘం జెండాను ఆవిష్కరించారు.

**ఘన స్వాగతం పలికిన కార్యకర్తలు**

నాదెండ్ల గ్రామానికి చేరుకున్న ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగకు ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు నీలి చొక్కాల దళం ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలతో ఆయనను సత్కరించి, నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా చిన్నపాటి ర్యాలీ నిర్వహించారు.

**హక్కుల సాధనే లక్ష్యం: ఉసురుపాటి బ్రహ్మయ్య**



జెండా ఆవిష్కరణ అనంతరం జరిగిన సభలో ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ, మాదిగల హక్కుల కోసం, వర్గీకరణ సాధన కోసం ఎంఆర్‌పిఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. గ్రామ స్థాయి నుండి సంఘాన్ని బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్త సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించేందుకు అందరూ ఏకతాటిపైకి రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట నియోజకవర్గం అధ్యక్షులు కొండముది సురేష్ మాదిగ పల్నాడు జిల్లా అధ్యక్షులు గుండాల నగేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్రఅధికార ప్రతినిధి కోట సుబ్బు మాదిగ, వినుకొండ నియోజకవర్గం ఇంచార్జి పచ్చిగోళ్ళ సుధాకర్ మాదిగ నరసరావుపేట మండల అధ్యక్షులు వేశపోగు తిమోతి మాదిగ,పల్నాడు జిల్లా మహిళా నాయకురాలు బొంత రాణి, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి పెనుమల అరుణ మాదిగ, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు స్థానిక మాదిగ సామాజిక వర్గ పెద్దలు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంక్షేమానికే డే కేర్ సెంటర్





ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

ఎంపీ మాధవనేని రఘునందన్ రావు

**విజేత మెదక్ :** వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలో ఏర్పాటు చేసిన వయోవృద్ధుల డే కేర్ కేంద్రాన్ని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ వయోవృద్ధులు సమాజానికి మార్గదర్శకులని పేర్కొన్నారు. వారి జీవితంలో చివరి దశలో ఒంటరితనం, ఆరోగ్య సమస్యలు వంటి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడకుండా ఉండేందుకు ఈ డే కేర్ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వయోవృద్ధులు రోజంతా సంతోషంగా గడపడానికి, ఇతరులతో కలసి మాట్లాడుకోవడానికి, విశ్రాంతిగా కాలక్షేపం చేయడానికి ఈ కేంద్రం వేదికగా నిలుస్తుందని చెప్పారు. డే కేర్ కేంద్రంలో వయోవృద్ధులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. కాలక్షేపం కోసం చెస్, కేరం వంటి ఆటపాటల సామగ్రి, రోజువారీ వార్తలు తెలుసుకునేందుకు పత్రికలు, పుస్తకాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అంతేకాకుండా వయోవృద్ధులు తమకు ఇష్టమైన వంటలు చేసుకుని తినేందుకు అవసరమైన వంట సామగ్రిని కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు. వయోవృద్ధులు ఈ కేంద్రాన్ని ఉపయోగించుకొని ఆనందంగా సమయం గడపాలని ఎమ్మెల్యే సూచించారు. వారికి మరింత సౌకర్యం కల్పించేందుకు తన సొంత నిధులతో బ్యాటరీ వాహనాన్ని అందజేస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు మాట్లాడుతూ సమాజంలో వయోవృద్ధుల పట్ల గౌరవం, ఆదరణ ఉండాలని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు వయోవృద్ధులకు చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. వయోవృద్ధులు శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉండేందుకు డే కేర్ కేంద్రాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సేవాసంఘం స్వచ్ఛంద సంస్థ ఈ డే కేర్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్, సేవాసంఘం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సతీష్, శ్రీధర్, డిసేబుల్ సెక్షన్ అధికారి జింక రవీందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మెదక్ జిల్లాలోని పలువురు వయోవృద్ధులు కార్యక్రమానికి హాజరై కేంద్ర ప్రారంభోత్సవాన్ని స్వాగతించారు. డే కేర్ కేంద్రం ద్వారా వయోవృద్ధులు ఒకేచోట చేరి పరస్పరం మాట్లాడుకుంటూ, పుస్తకాలు చదువుతూ, ఆటపాటలతో ఆనందంగా కాలక్షేపం చేసే అవకాశం లభిస్తుందని అధికారులు తెలిపారు. వయోవృద్ధుల కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కేంద్రం ప్రారంభంతో మెదక్ జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమానికి మరో కొత్త దారితెరచిందని స్థానికులు పేర్కొన్నారు.

# లైసెన్స్ లేని డ్రైవింగ్ ప్రాణాంతకం

## శాసనమండలిలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



**విజేత అమరావతి :** రాష్ట్రంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం వల్ల బాధితులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులపై శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ శాసనమండలి సమావేశాల్లో కీలక ప్రసంగం చేశారు. గ్రామాలు, పట్టణాల్లో చాలా మంది డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే ట్రాక్టర్లు, ఆటోలు, మోటార్ సైకిళ్లు వంటి వాహనాలను నడుపుతున్నారని, ఇది తీవ్రమైన ప్రమాదాలకు దారితీస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పరిహారానికి అడ్డంకులు: ప్రమాదం జరిగినప్పుడు డ్రైవర్ వద్ద చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేకపోతే, ఇన్సూరెన్స్ కంపెనీలు పరిహారం చెల్లించడానికి నిరాకరిస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. దీనివల్ల కుటుంబ పెద్దను కోల్పోయిన బాధితులు అటు ప్రాణ నష్టంతో పాటు, ఇటు ఆర్థికంగానూ రోడ్డున పడుతున్నారని తెలిపారు. క్షేత్రస్థాయి యంత్రాంగం భాగస్వామ్యం: ప్రతి గ్రామంలో ఉన్న సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు మరియు పంచాయతీ కార్యదర్శులు ఈ విషయంలో చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామాల్లోని వాహన యజమానులను గుర్తించి, వారికి అవగాహన కల్పించడం ద్వారా లైసెన్సులు ఇప్పించాలని కోరారు. ప్రభుత్వానికి విన్నపం: లైసెన్స్, ఇన్సూరెన్స్ లేని వాహనాలపై కఠిన నిబంధనలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తద్వారా ప్రమాదాల సంఖ్యను తగ్గించడంతో పాటు, ప్రమాదం సంభవించిన సందర్భాల్లో బాధిత కుటుంబాలకు ఇన్సూరెన్స్ ద్వారా ఆర్థిక రక్షణ కల్పించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు మరియు వారి కుటుంబాల ఆర్థిక భద్రత కోసం ప్రభుత్వం ఈ సూచనలను తక్షణమే పరిగణనలోకి తీసుకోవాలని ఆయన విన్నవించారు.

# కన్నుల పండుగగా శ్రీ గట్టు వెంకటేశ్వర స్వామి రథోత్సవం





**విజేత,రామసముద్రం :** రామసముద్రం మండలం చంబకూరు గ్రామంలో గురువారం శ్రీ గట్టు వెంకటేశ్వర స్వామి రథోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు.ఈ సందర్భంగా అర్చకులు బృందం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి,తేరులో కొలువు ఉంచి పురవీధులలో గోవింద నామస్మరణలతో రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.భక్తులకు అన్నదాన కార్యక్రమలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మంత్రి సీతక్క కి కృతజ్ఞతలు తెలిపిన టీఎన్జీవో సభ్యులు





**విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** జిల్లా కేంద్రానికి విచ్చేసిన పంచాయతీ రాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి,నిజామాబాద్ జిల్లా ఇంచార్జి సీతక్క ని ఆర్ అండ్ బి వసతి గృహం లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఇటీవల ఉద్యోగుల ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్(ఈహెచ్ఎస్), ఉద్యోగుల వ్యక్తిగత చందాతో పాటు ప్రభుత్వ చందా కలిపి పటిష్టంగా ఏర్పాటు చేయుటకు మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులు రావాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సమావేశం లో ప్రవేశపెట్టిన తీర్మానం ఆమోదానికి కృషి చేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్యలన్నింటిని త్వరలో పరిష్కరించుటకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్,టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్,జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్,ఈ కార్యక్రమానికి టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు కేపీ. సునీత,జాఫర్ హుస్సేన్,అర్బన్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు జాకీర్ హుస్సేన్,మారుతి జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, టీఎన్జీవో ముఖ్య సలహాదారులు వరమాల సుధాకర్, అంగన్వాడీ ఉద్యోగులు, తదితరులు హాజరయ్యారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



**విజేత గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం చెబర్తి లో బబ్బురి చంద్రమౌళి అకాల మరణం చెందగా విషయం తెలుసుకున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి శుక్రవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి,వార్డ్ సభ్యులు అనిల్ కు మనో ధైర్యం కల్పించారు, వారితో పాటు కాంగ్రెస్ పార్టీ మర్కూక్ మండల అధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్, సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశం గౌడ్ గ్రామ సర్పంచ్ ర్యాకం యాదగిరి,మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ బబ్బురి రాములు గౌడ్,భాలనరసయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

విజేత

శనివారం-07-మార్చి-2026

# ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ :** విజేత, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : జిల్లాలో సమగ్ర అభివృద్ధి మరియు ప్రజల భాగస్వామ్యాన్నిపెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలు వివిధ విభాగాల సమన్వయంతో నిర్వహించబడతాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమాలలో భాగంగా ప్రతి శాఖకుసంబంధించి నోడల్ విభాగాలు,నోడల్ అధికారులునియమించబడినట్లు ఆయన పేర్కొన్నారు.మార్చి 6 నుండి మార్చి 15, 2026 వరకు శుభ్రత మరియు ఫైల్ క్లియరెన్స్ కార్యక్రమాలునిర్వహించబడతాయని తెలిపారు.ఈకార్యక్రమానికి మున్సిపల్, పంచాయతి రాజ్, ఇతర ప్రభుత్వ విభాగాలు నోడల్ విభాగాలుగా పనిచేస్తాయని అన్నారు.ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 11 వరకు రోడ్డు భద్రత అనే థీమ్ తో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలునిర్వహించబడతాయని తెలిపారు. రక్షణాత్మక డ్రైవింగ్ ప్రచారాలు, రోడ్డు భద్రత ప్రతిజ్ఞ డ్రైవ్‌లు, గ్రామ రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు, సమారిటన్స్గుర్తింపుకార్యక్రమాలు చేపట్టబడతాయని తెలిపారు. అలాగే ఓఆర్ఆర్, హైవేలపై భారీ వాహనాల అనధికార పార్కింగ్‌ను నివారించే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 13 నుండి ఏప్రిల్ 18 వరకు మహిళలు మరియు పిల్లల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు.మహిళలు, పిల్లలపై జరిగే నేరాలను నివారించేందుకు చర్చలు,అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 26 వరకు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించబడతాయని,. ఈ కార్యక్రమాల్లో ఎస్సి, ఎస్టీ, బిసి, మైనారిటీ,గృహనిర్మాణ శాఖలు భాగస్వామ్యంఅవుతాయన్నారు. ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు మహిళలు మరియు పిల్లల పోషణ అంశంపై కార్యక్రమాలు నడుంటాయని తెలిపారు. గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు, 0--6 సంవత్సరాల పిల్లలు మరియు కౌమార బాలికల ఆరోగ్య పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలి పారు. తీవ్ర, అతి తీవ్ర పోషణ లోపం ఉన్న పిల్లలను గుర్తించి, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రోత్సాహం, పోషకాహార వంటకాల పోటీలు మరియు సమాజ అవగాహనకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక అవగహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.మే 4 నుండి మే 10 వరకు వ్యవసాయ అంశంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు, వ్యవసాయం, ఆదాయం, నీటిపారుదల విభాగాల సమన్వయంతో రైతులకు సాంకేతిక మార్గదర్శకాలు అందించబడతాయని తెలిపారు. మే 11 నుండి మే 16 వరకు విద్య, సౌకర్యాలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని, మే 18 నుండి మే 23 వరకు యువత మరియు క్రీడలు అంశంపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువతకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు వివిధ క్రీడా పోటీలు మరియు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.మే 25 నుండి మే 30 వరకు మహిళల సాధికారతపై కార్యక్రమాలునిర్వహించబడతాయని అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలతో చర్చలు నిర్వహించి మహిళల అభివృద్ధికిచర్యలుతీసుకుంటామని తెలిపారు.జూన్ 1 నుండి జూన్ 12 వరకు పర్యావరణ పరిరక్షణకార్యక్రమాలునిర్వహించబడతాయని, వనమహోత్సవం కింద చెట్ల నాటడం, పచ్చదనం పెంపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం తగ్గించే అంశాలపై కార్యక్రమాలునిర్వహించబడతాయని తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖలఅధికారులుసమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజలు కూడా ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



# ట్రాక్టర్ ఆటో డీ ఇద్దరు దుర్మరణం









**విజేత :ఏదుల :** ఏదుల మండల కేంద్ర సమీపంలో గురువారం రాత్రి 10గంటల సమయం లో రేవల్లి మండలం కొంకలపల్లి గ్రామానికి చెందిన పదిమంది కోడేర్ మండలం జనుపల్లి దగ్గర మంత్రాలమ్మ జాతర తల్లి దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఏదుల సమీపంలో నర్సింహా రెడ్డి కోళ్ల చెడ్డు దగ్గర కొంకలపల్లి ఆటో పానగల్ మండలం శాగపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ బుడ్డపోట్టుతో వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ను దికొట్టడం తో ఆటో ప్రయాణిస్తున్న కోమరి వెంకటయ్య50 అక్కడికి అక్కడనే దుర్మరణం చెందడం జరిగింది మరో తొమ్మిది మంది నీ రేవల్లి కి చెందిన 108 అంబులెన్సు లో వనపర్తి కి తరలిస్తుండగా మార్గమధ్యలో మండ్ల సుమిత్రమ్మ 40 మరణించడం జరిగిందిఆటో డ్రైవర్ కురుమయ్య అతని భార్య రజిత, కోమరి సుజాత, కళమ్మ, శివయ్య తీర్వంగా గాయపడ్డారు రాముడు, దుడుమయ్య, వరుణ్, సుజాత కు గాయాలు అయ్యాయి 108ఉమ్మడి జిల్లా మేనేజర్ రవికుమార్, కోఆర్డినేటర్, రత్నమయ్య 108 వాహనాలను రప్పించి క్షతగ్రత్తులనువనపర్తి ప్రభుత్వ అస్పత్రి కి తరలిచారు గోపాల్ పేట ఎసై జగన్ మోహన్ సిబ్బంది తో సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు

# ఇఫ్తార్ విందు లో పాల్గొన్న సీపీ





**విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** నగరంలోని 2వ పోలీస్ స్టేషన్ పరిధిలోని జామా మసీద్‌లో మజీద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముక్తి సయీద్ అక్బర్ నిర్వహించిన దువాలో సీపీ పాల్గొనిఅనంతరం ఉపవాస విరమణ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రంజాన్ మాసం విశిష్టతను విశ్లేషణాత్మకంగా వివరించారు. రంజాన్ అనేది కేవలం ఉపవాసాల నెల మాత్రమే కాకుండా,మనస్సును పరిశుభ్రం చేసుకునే ఆత్మపరిశీలన కాలమని అన్నారు. ఉపవాసం ద్వారా నియమం, సహనం, క్రమశిక్షణ పెంపొందుతాయని,పేదల పట్ల కరుణాభావం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. దానధర్మాలు, సహనశీలత, సోదరభావం వంటి విలువలు ఈ పవిత్ర మాసంలో మరింత ఆవిష్కృతమవుతాయని చెప్పారు. అల్లా కృపతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు.అలాగే అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగి నిజామాబాద్ జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ సి.ఐ శ్రీనివాస్ రాజ్, ఎస్.ఐ సయ్యద్ ముజాహిద్, జనరల్ సెక్రటరీ అబ్దుల్ మన్నన్, కార్పొరేటర్ అబ్దుల్ అందాన్, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖుద్దుస్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ధర్మారం గ్రామంలో
## వైభవంగా బరడ పోచమ్మ బోనాల పండగ





**విజేత పిట్లం :** కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని ధర్మారం గ్రామంలో బరడ పోచమ్మ బోనాల పండుగను గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పిస్తూ గ్రామ వీధుల గుండా సంప్రదాయబద్ధంగా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల మారుతి, ఉప సర్పంచ్ హోర్టూర్ హనుమంతరావు, పాండు పాటిల్, వాసవి పండరి, దుంపల సాయిలు, కంత్రిపల్లి కృష్ణ, జిన్న నారాయణ, తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు భారీగా హాజరై పండుగను విజయవంతం చేశారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక
## కార్యక్రమం ప్రారంభించిన సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి



**విజేత, ములకలపల్లి :** ములకలపల్లి మండలంలో ముకమామిడి గ్రామపంచాయతీ లో పంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి ప్రారంభించడం జరిగింది.మొదటి రోజు ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రత మరియు ప్రాంగణ నిర్వహణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ కేసుపాక శ్రీనివాసరావు,గుట్టగూడెం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుగులోత్ భద్రూ నాయక్,అంగన్వాడి ఉపాధ్యాయురాలు వేప విజయ,ఉపాధి హామీ సిబ్బంది మాలోత్ రవి పంచాయతీ సిబ్బంది గడ్డం వెంకటేష్ కోండ్రు శ్రీను,సున్నం శీను,కుంజా నాగేష్,బత్తుల వెంకటేశ్వర్లు,గ్రామ పెద్దలు శాస్త్రబోయిన వెంకటేశ్వర్లు,పాయం ముత్తయ్య తదితరులుపాల్గొన్నారు.


## మరిపెడ మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా
## బాధ్యతలు స్వీకరించిన ప్రగతి శ్రీపాల్ రెడ్డి



**విజేత మరిపెడ :** మరిపెడ మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా ప్రగతి శ్రీపాల్ రెడ్డి శుక్రవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆమె పదవి బాధ్యతలను స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రగతి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ మరిపెడ పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రజల ఆశలు నెరవేర్చే విధంగా పారదర్శక పాలన అందించేందుకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు
## నేడు జామెట్రీ బాక్సులు పంపిణీ!

బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జాలిగం రాకేష్!!



**విజేత,శివంపేట :** ఈనెల 14వ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కాబోతున్న తరుణంలో నిరుపేద పేద మధ్యతరగతి కుటుంబాల విద్యార్థిని విద్యార్థులకు వారి విద్యాభివృద్ధికి ప్రోత్సవం అందించాలని ఉద్దేశంతో నేడు కుత్బుల్లాపూర్ లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జామెట్రీ బాక్సులు పంపిణీ చేయడం జరుగుతుందని బి ఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కుత్బుల్లాపూర్ బి ఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి జలగం రాకేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థిని విద్యార్థులు పరీక్షల్లో విజయవంతంగా రాసి మంచి ఫలితాలు సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని మనస్ఫూర్తిగా ఆ దేవుని ఆశిస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మల్లంపేట్‌లో బడా నిర్మాణం దుండిగల్
## సర్కిల్‌లో టౌన్ ప్లానింగ్ విభాగం నిర్లక్ష్యం?



**అక్షర విజేత, దుండిగల్ :-** దుండిగల్ సర్కిల్ పరిధిలోని మల్లంపేట్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సరైన అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల భవన నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మల్లంపేట్ ప్రధాన రహదారి పక్కన నిర్మాణంలో ఉన్న ఈ భారీ భవనం పలు అంతస్తులతో కొనసాగుతోంది. నిర్మాణం మొత్తం గ్రీన్ నెట్‌తో కప్పి వేయడంతో బయటకు కనిపించకుండా పనులు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ నిర్మాణానికి సంబంధించి మున్సిపల్ అనుమతులు ఉన్నాయా? లేకపోతే అక్రమంగానే నిర్మాణం కొనసాగుతోందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ప్రాంతంలో పూర్తి స్థాయి టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నప్పటికీ ఈ అక్రమ నిర్మాణాన్ని ఆపకుండా ఉండటం ఆశ్చర్యానికి గురిచేస్తోందని స్థానికులు అంటున్నారు. కొందరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చేతుల్లోనే పర్యవేక్షణ ఉండటంతో అక్రమ నిర్మాణాలపై సరైన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇకపోతే ఇలాంటి బహుళ అంతస్తుల భవనాలు అనుమతులు లేకుండా నిర్మిస్తే భవిష్యత్తులో ప్రజల భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో అక్రమ నిర్మాణాలు ఆగకుండా కొనసాగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అందువల్ల వెంటనే టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ నిర్మాణంపై విచారణ జరిపి అనుమతులు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని ప్రజలకు వెల్లడించాలని, అక్రమమైతే తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.స్థానికుల"అనుమతులు లేకుండా ఇంత పెద్ద భవనం ఎలా నిర్మిస్తున్నారు? అధికారులు ఎందుకు కన్నెత్తి చూడడం లేదు? అని మండిపడుతున్నారు

## తీగుల్ గ్రామ రజక సంఘం
## అధ్యక్షులుగా రాచమల్ల స్వామి ఏకగ్రీవంగాఎన్నిక



**విజేత గజ్వేల్ :** సిద్ధిపేట జిల్ల జగదేవపూర్ మండలం తీగుల్ గ్రామంలో శుక్రవారం రోజు జగదేవపూర్ మండల రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల సీతయ్య ఆధ్వర్యంలో రజక సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహిచారు.తీగుల్ రజక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు.తిగుల్ గ్రామ రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల స్వామి ఉపాధ్యక్షులు రాచమల్ల శ్రీకాంత్, రాచమల్ల నాగరాజు, కోశాధికారి రాచమల్ల గణేష్, ప్రచార కార్యదర్శి రాచమల్ల కుమార్, గౌరవ అధ్యక్షులు రాచమల్ల శ్రీనివాస్, సలహాదారులు పరదేశి భిక్షపతి, రాచమల్ల చంద్ర శేఖర్ ,జనరల్ సెక్రటరీ రాచమల్ల అజయ్, జయింట్ సెక్రటరీ పరదేసి కరుణాకర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన గ్రామ రజక సంఘం బంధువులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ రజక ఐక్యత కు సంఘం అభివృద్ధికి కులస్తుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో తీగుల్ రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్వరం సీఐ రాఘవేందర్ రెడ్డిని
## సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు





**విజేత మహేశ్వరం :** మహేశ్వరం సిఐ ఎస్ రాఘవేందర్ రెడ్డిని సన్మానించిన తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్,రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని నూతనంగా బాధ్యతలు చేపట్టిన మహేశ్వరం సీఐ ఎస్ రాఘవేందర్ రెడ్డికి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియ చేసిన తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్. మహేశ్వరం గ్రామ మాజీ ఉప సర్పంచ్ కర్రెల రాములు ముదిరాజ్ .ముదిరాజ్ సంఘం మహేశ్వరం మండల నాయకులు గదగుటి జంగయ్య ముదిరాజ్. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం గ్రామ శాఖ అధ్యక్షులు బంగారుగళ్ల లాజర్. కోళ్ల పడకల్ సర్పంచ్ చేపంగి ప్రవీణ్.వార్డ్ సభ్యులు రమేష్. కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షులు గదగూటి హరికృష్ణ ముదిరాజ్. మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు షేక్ హాజీ బాబా.కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం గ్రామ యూత్ అధ్యక్షులు స్వర్ణగంటి ఆకాష్.తుడుము శ్రీకాంత్. పేయ్యల గణేష్ . పేయ్యల పవన్. తదితరులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొనరు,

## హనుమంతరావు కూతురు
## వివాహ వేడుకకు హాజరైన ప్రముఖులు

మాజీ మంత్రి హరీష్ రావు,ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

ఎమ్మెల్సీ యాదవ రెడ్డి,మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి



**విజేత గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన మాజీ నాచారం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ శబ్నవీసు హనుమంతరావు పెద్ద కూతురు జాహ్నవి వివాహం శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని వైష్ణవి గార్డెన్స్ లో జరిగింది.ఈ వివాహ వేడుకకు మాజీ మంత్రి హరీష్ రావు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్సీ డా.యాదవ రెడ్డి,మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో వారితో పాటు గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్,వైస్ చైర్మన్ కళ్యాణ్కార్ పద్మాబాయి నరసింగరావు,మాజీ ఎంపీపీ పాండు గౌడ్,వైస్ ఎంపీపీ బాల్ రెడ్డి,మాజీ జడ్పిటిసి మంగమ్మ రామచంద్రం,మండల బీసీ సెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్, ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి అధికారులకు టాక్సీ పై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదు

**మంఖల్ 67వ డివిజన్ జిహెచ్ఎంసి కార్యాలయంలో అస్తవ్యస్తంగా పరిపాలన**

**జిహెచ్ఎంసి అధికారులు ముక్కుపిండి పన్ను వసూలు చేస్తున్నారు**

**తుక్కుగూడ జిహెచ్ఎంసి కార్యాలయంలో ప్రజల సమస్యలు పట్టించుకునే నాధుడే లేడా...**

**కృష్ణ వాటర్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు రాదో తెలియదు**

**మంఖల్ 67వ డివిజన్ లో ప్రజా పరిపాలన గాలి కొదలిసిన జిహెచ్ఎంసి అధికారులు**

**జిహెచ్ఎంసి కార్యాలయంలో ఏం అడిగినా మాకు ఏమీ తెలియదు అంటున్న అధికారులు**

**ప్రజా సమస్యలు పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున 67వ డివిజన్ నుంచి ఉద్యమిస్తాం**

**రంగారెడ్డి జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు మణికొండ నర్సింగ్ రాజ్**



**విజేత మహేశ్వరం :** జిహెచ్ఎంసి అధికారులకు టాక్సీ పై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని రంగారెడ్డి జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు మణికొండ నర్సింగ్ రాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుక్కుగూడ మున్సిపాలిటీగా ఉన్నప్పుడు ఉన్న ఇంటి పన్ను జిహెచ్ఎంసిగా మారిన పన్ను మాత్రం పాత పద్ధతిలోనే వసూలు చేస్తున్నారు. మిగతా రూల్స్ అన్ని జిహెచ్ఎంసి రూల్స్ పాటిస్తున్నారు. గతంలో మున్సిపల్ గా ఉన్నప్పుడు ప్రజా పరిపాలన బాగుండేదని ప్రజా సమస్యలు ఉన్నప్పుడు మున్సిపల్ అధికారులను అడిగి సమస్యలు పరిష్కారానికి కృషి చేసేదని కానీ మున్సిపల్ నుండి జిహెచ్ఎంసి గా మారినప్పటి నుండి ప్రజా సమస్యలు కాలికి వదిలేసి జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోవడంలేదని తుక్కుగూడ ప్రజల వద్ద నుండి ఇంటి పన్నులు భారీగా వసూలు చేస్తున్నారని జిహెచ్ఎంసి మారిన తర్వాత ఇంటి పనులు తగ్గాల కదా అని అడిగితే జిహెచ్ఎంసి అధికారులు మాకు తెలియదు అంటూ సమాధానం ఇస్తున్నారు. ప్రజా సమస్యల కోసం మంఖల్ 67వ డివిజన్ జిహెచ్ఎంసి కార్యాలయ వద్దకు వెళితే అక్కడ ఎవరు ఉండడం లేదని ప్రజలు తమ సమస్యల కోసం ఎక్కడికి వెళ్లాలో అర్థం కావడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారని ఆయన అన్నారు. ఇక తాగడానికి కృష్ణ వాటర్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు రాదో తెలియకుండా పోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులకు ఇంటి పన్ను వసూలు చేసే దాని మీద ఉన్న శ్రద్ధ ప్రజా పరిపాలన ప్రజల సమస్యల మీద లేదని ఆయన అన్నారు.మంఖల్ 67వ డివిజన్ జిహెచ్ఎంసి కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార కోసం ఫిర్యాదుల రిజిస్టర్ ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారని ఆయన అన్నారు. మంఖల్ 67వ డివిజన్ లో ప్రజా సమస్యల పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. తుక్కుగూడ జిహెచ్ఎంసి పరిధిలో పూర్తిగా పరిపాలన స్తంభించిందని అసలు ఎలాంటి సమస్యలు ఉన్నా పట్టించుకోవడంలేదని అధికారులు ఏది ఈయన మాకు తెలియదని సమాధానం ఇస్తున్నారని అసలు ఏం జరుగుతుంది అర్థం కావడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తుక్కుగూడ మున్సిపల్ నుండి జిహెచ్ఎంసి గా మారిన తర్వాత సమస్యలకు నిలయంగా మారిందని ఆయన అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని మణికొండ నర్సింగ్ రాజ్ హెచ్చరించారు.

# కాప్రా లో కాంగ్రెస్ నాయకుల కనుసన్నల్లో భారీగా అక్రమ నిర్మాణాలు

**అక్రమ నిర్మాణదారులను కాపాడుతున్న కాప్రా టౌన్ ప్లానింగ్ యంత్రాంగం....**

**ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి....**

**విజేత,మేడ్చల్ మల్కాజ్గిరి ప్రతినిధి :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాప్రా సర్కిల్ లో ని ఎల్లారెడ్డి గూడ శాలివాహన ఎంక్లేవ్ నియర్ జనప్రియ రోడ్ షిరిడి నగర్ లో గల సర్వే నంబర్ 658 (P), 661(గ్రా), 684(P)ల లో నిబంధనలు పాటించకుండా జి ప్లస్ త్రీ పెంట్ హౌస్ కాంగ్రెస్ నాయకుల కనుసన్న ల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుతున్నయి. కాంగ్రెస్ నాయకులు ద్వంద వైఖరి ప్రదర్శిస్తూ ఆదాయానికి గండి కొడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు పేదలను బలి చేస్తూ నిబంధనలను పాటించకుండా అక్రమ నిర్మాణదారులను కాపాడే ప్రయత్నం కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారులు చేస్తున్నారు. పెద్ద ఎత్తున కమర్షియల్ నిర్మాణం మరియు రేకుల భారీ షటర్ల నిర్మాణం చేస్తున్న ఈ అనుమతులు లేని నిర్మాణాలపై ప్రభుత్వపరమైన చర్యలు తీసుకోకుండా కొంతమంది పేద మధ్యతరగతి ఇండ్లను కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేస్తూ పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారు. అని సామాన్య మధ్యతరగతి ప్రజలు విస్మయానికి గురవుతున్నారు. ఇలాంటి




నిబంధనలు లేని నిర్మాణాలపై పత్రికలలో వచ్చిన వార్తలను టౌన్ ప్లానింగ్ అధికారులు పెడచెవిన పెడుతున్నారు. అలాంటి కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారులు మధ్యతరగతి ప్రజల ఇండ్లను మాత్రం ఎందుకు సీజ్ చేస్తున్నారు. అని కాప్ర ప్రజలు విస్మయానికి గురవుతున్నారు. నిబంధనలు లేని నిర్మాణాలపై ఆ ఏరియా చైర్మన్ లకు సమాచారం ఇచ్చినా వారి పనితీరు పారదర్శకంగా లేకుండా పోయింది. అలాంటి అక్రమ నిర్మాణాలపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. చైర్మన్ లను ఇందుకు సంబంధించి సమాధానం అడిగినప్పుడు.... ఇందులో మా ప్రయత్నం మేము చేసాము ఇకపై పూర్తి అధికారం పై అధికారి చేతిలో ఉన్నాయి. అందువల్లనే ఆలస్యం అవుతుంది. అని చైన్ మేన్లు సమాధానం చెబుతున్నారు. ఇంతకుముందు భారీ ఎత్తున కొన్ని నిబంధనలు లేని నిర్మాణాలని సీజ్ చేశారు. మరి అనుమతులు లేని భారీ కమర్షియల్ మరియు భారీ రేకుల షట్టర్లు నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కాప్రా మున్సిపల్ ప్రజలు అధికారులపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. కాప్రా వంపుగూడ రోడ్డు శనివారం మార్కెట్ రోడ్డులో రెండు ప్లాట్లలో రేకుల షట్టర్ల నిర్మాణం మరియు పెంట్ హౌస్ గ్రౌండ్ నిర్మాణం, కాప్రా ఓల్డ్ విలేజ్ రోడ్లో పాత ఇంటి నీ కమర్షియల్ గా షట్టర్ల నిర్మాణం మరియు పద్మశాలి టౌన్షిప్ లోని గ్రౌండ్ ప్లస్ త్రీ ఫ్లోర్ మరియు చక్రిపురం నాగార్జున నగర్ కాలనీలోని జి ప్లస్ త్రీ ఈ అక్రమ నిర్మాణాలపై ఇకనైనా కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారులు పైన పేర్కొన్న నిర్మాణాలపై ఇంతకుముందు కొన్ని సీజ్ చేసిన తరహాలో పై వాటిపై కూడా విచారణ చేపట్టి చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# వయోవృద్ధుల కోసం డే కేర్ సెంటర్ ప్రారంభం

**ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**

**ఎంపీ మాధవనేని రఘునందన్ రావు**





**విజేత, మెదక్ జిల్లా ప్రతినిధి :** మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్‌ను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మరియు మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ వయోవృద్ధుల కోసం ఈ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వృద్ధులు తమ కాలక్షేపం కోసం ఆట సామగ్రి, వార్తాపత్రికలు, పుస్తకాలు వంటి సౌకర్యాలను ఇక్కడ వినియోగించుకోవచ్చన్నారు. అలాగే వారు సరదాగా వంట చేసుకుని తినేందుకు అవసరమైన వంట సామగ్రి కూడా అందుబాటులో ఉంటుందని చెప్పారు. తమ శేష జీవితంలో ఎదురయ్యే సమస్యలను కొంతసేపు పక్కన పెట్టి ఇతర వృద్ధులతో కలిసి ఆనందంగా గడపడానికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కేంద్రానికి తన సొంత నిధులతో బ్యాటరీ వాహనాన్ని అందజేస్తామని తెలిపారు. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమానికి అధికారులు మరింత శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సేవాసంఘం స్వచ్ఛంద సంస్థ ఈ డే కేర్ సెంటర్‌ను నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్, సేవాసంఘం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సతీష్, శ్రీధర్, డిసేబుల్ సెక్షన్ అధికారి జింక రవీందర్ తదితరులు పాల్గొన్నారు. మెదక్ జిల్లాకు చెందిన పలువురు వయోవృద్ధులు హాజరయ్యారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో వసతుల కల్పన




**విజేత, బాల్కొండ :** కిసాన్ నగర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్బీఐ ఎంపిక చేసి,వాటిని అన్ని హంగులతో తీర్చిదిద్దుతోంది.?వసతుల కల్పన పిల్లలు ఆడుకునే ఆట వస్తువుల నుండి, వారు భోజనం చేసే ప్లేట్లు, వాటర్ బాటిళ్ల వరకు ప్రతి చిన్న వస్తువును ఎస్‌బీఐ సమకూర్చింది.?కిసాన్ నగర్ యూనిట్ ఈ పథకంలో భాగంగా కిసాన్ నగర్ అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అందజేశారు.?మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ లక్ష్మీ రెడ్డి మాట్లాడుతూ ఎస్‌బీఐ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా తెలంగాణలోని అంగన్‌వాడీ చిన్నారుల కోసం ఈ ముందడుగు వేసింది.పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం ద్వారా వారి విద్యాభ్యాసం మెరుగుపడుతుందని,అందుకే వాటర్ బాటిల్స్ నుండి ప్లేట్ల వరకు ప్రతి వస్తువును నాణ్యతతో అందిస్తున్నాం. మరియు కోతులు రాకుండా గ్రిల్ ని ఏర్పాటు చేశారు అని తెలిపారు.?ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మరియు సిబ్బంది ఎస్‌బీఐ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎస్బిఐ సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్ ) కార్యక్రమంలో భాగంగా కిసాన్ నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ సహకారంతో ఆధునీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్‌వాడీ పిల్లలకు అవసరమైన వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్‌బిఐ కిసాన్ నగర్ బ్రాంచ్ మేనేజర్ రవి మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ లక్ష్మీ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.గ్రామ సర్పంచ్ రామ్ రాజ్ గౌడ్,ఉప సర్పంచ్ స్వామి,వార్డ్ మెంబర్లు సమత, హామిద్, మరియు అంగన్‌వాడీ టీచర్ గాయత్రి సుగుణాకర్ పిల్లల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.?ముఖ్య అంశాలు?సర్వతోముఖాభివృద్ధి తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 60 అంగన్‌వాడీ స్కూళ్లను

# కెసిఆర్ కు శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల ఆహ్వానం

**కెసిఆర్ ను ఆశీర్వదించిన ఆలయ అర్చకులు**



**విజేత గజ్వేల్ :** బిఆర్ఎస్ అధినేత,తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రివర్యులు కేసీఆర్ ను శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం నాచారం గుట్ట ప్రతినిధులు గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డితో కలిసి శుక్రవారం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కలిశారు.ఈ నెల 8వ తేదీ నుండి 19వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరు కావాల్సిందిగా కోరుతూ ఆలయ చైర్మన్ రవీందర్,ఈఓ రంగాచారి, అర్చకులు కేసీఆర్ కు ఆహ్వాన పత్రికను,స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.ఈ సందర్భగా ఆలయ అర్చకులు కేసీఆర్ ను ఆశీర్వదించారు.

# కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రంలో పొత్తూరికి సత్కారం

**ఉగాది కవి సమ్మేళనంలో కవితా గానం**

**సీతారామారావును అభినందించిన స్టేషన్ డైరెక్టర్ శంకర్రావు**



**విజేత ఖమ్మం ప్రతినిధి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రంలో ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ కవి పొత్తూరి సీతారామారావుకు ఘన సత్కారం లభించింది. కొత్తగూడెం రేడియో స్టేషన్ డైరెక్టర్ కొలిపాక శంకర్రావు నేతృత్వంలో ఖమ్మం, భద్రాది కొత్తగూడెం జిల్లాలకు చెందిన కవులు, కవయిత్రుల చేత శుక్రవారం పరాభవ నామ ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. వ్యాఖ్యాతగా కట్టా రామకృష్ణ వ్యవహరించారు. ఈ కవి సమ్మేళనంలో పొత్తూరి సీతారామారావు “పరాభవా మోదాన్ని ఇవ్వు” అనే శీర్షిక నా రాసిన కవితను ఆలపించారు. ఉగాది పర్వదినం సందర్భంగా సీతారామారావు మంచి కవితను ఆలపించారని ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్ శంకర్రావుతో పాటు పలువురు ఆయనను అభినందించారు. అనంతరం పుత్తూరుకి పూలు, పండ్లు అందజేసి తువ్వాలు కప్పి ఘనంగా సత్కరించారు.

# కాకి ఈశ్వర్ కుమారుడు వివాహానికి కేఎల్ఆర్ కు ఆహ్వానం



**విజేత మహేశ్వరం :** మహేశ్వరం నియోజక వర్గం తుక్కుగూడ లో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి,కి పెండ్లి పత్రిక ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్ . తమ కుమారుడి వివాహానికి ఆహ్వానించడం జరిగింది ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మహేశ్వరం మండల నాయకులు గదగూటి జంగయ్య ముదిరాజ్. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారుగళ్ల లాజర్, మహేశ్వరం గ్రామ మాజీ ఉప సర్పంచ్ దోమ శ్రీనివాస్ రెడ్డి. శివగంగ ఆలయ కమిటీ డైరెక్టర్ పేయ్యాల దేవేందర్ . కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం సేవాదళ్ అధ్యక్షుడు గదగుటి హరికృష్ణ ముదిరాజ్. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ మండల్ చైర్మన్ మహమ్మద్ ఇర్షాద్ మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు షేక్ హాజీ బాబా కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం గ్రామ యూత్ అధ్యక్షులు స్వర్ణ గంటి ఆకాష్ .తదితరులు పాల్గొన్నారు

# గోమారంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో సిసి రోడ్లు పనులు ప్రారంభం!

**నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజు రెడ్డి!!**



**విజేత,శివంపేట :** శివంపేట మండల కేంద్రంలోని గోమారం గ్రామంలో 30 లక్షల ఉపాధి హామీ నిధులతో సిసి రోడ్డు పనులు నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి ప్రారంభించారు. గోమారం గ్రామంలోని మొదటివాడు మరియు మిగతా వార్డులలో సీసీ రోడ్డు పనులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ కార్యకర్తల ఆధ్వర్యంలో సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుమ్మరి హైమావతి ఆంజనేయులు, ఉప సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, నూతన గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, మరియు తాజా మాజీ సర్పంచ్ లావణ్య మాధవరెడ్డి, తాజా మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, తాజా మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, శివంపేట పిఎసిఎస్ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, శివంపేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులునవీన్ గుప్తా, శ్రీనివాస్ రెడ్డి, మాణిక్యం, ప్రభాకర్ రెడ్డి, వెంకటేశం సీతారాంరెడ్డి, సుధీర్ రెడ్డి మరియు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు సిసి రోడ్డు పనులు ప్రారంభంలో పాల్గొన్నారు.



# గుమ్లాపూర్ లో ఉచిత గర్భకోశ నివారణ శిబిరం



**విజేత,చొప్పదండి :** చొప్పదండి మండల పరిధిలోని గుమ్లాపూర్ గ్రామంలో పశువులకు ఉచిత గర్భకోశ నివారణ శిబిరాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా పశువులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు ఈ కార్యక్రమం పశు వైద్య పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి డాక్టర్ లింగారెడ్డి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మండల పశువైద్యాధికారి డాక్టర్ శశికాంత్ రెడ్డి తోపాటు వైద్యులు పశువైద్య సిబ్బంది గోపాలమిత్ర లు పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని గుమ్మాలాపూర్ గ్రామ సర్పంచ్ లింగాల ఆనంద్ ప్రారంభించారు

# సింగరేణి జియం కు వినతి పత్రమిచ్చిన సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రెహానా బేగం



**విజేత, సత్తుపల్లి. :** సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సత్తుపల్లి సింగరేణి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్‌కు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ రెహానా కమల్ పాషా,మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత వినతి పత్రాన్ని అందజేశారు. కమ్యూనిటీ హాల్ వద్ద విద్యుత్ సదుపాయం, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, మట్టి తొలకం పనులు చేపట్టడం, సోలార్ లైట్ల ఏర్పాటు వంటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరారు. స్థానిక ప్రజలకు కమ్యూనిటీ హాల్ ఎంతో అవసరమని పేర్కొంటూ అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు సింగరేణి యాజమాన్యం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు నరుకుళ్ళ అప్పారావు, వార్డ్ కౌన్సిలర్లు జగన్నాథం శ్రీను, హకీమ్, శరత్ చంద్రతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నవాబుపేట గ్రామంలో ముగిసిన ఉర్సు ఉత్సవాలు.!!



**విజేత,శివంపేట :** శివంపేట మండలం కేంద్రంలోని నవబు పేట్ గ్రామంలోని 39 వ ఉర్సు ఉత్సవాలు ఆశ్రమ నిర్వాహకులు లతీఫ్ షరీఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి సిద్దిపేట పీఠాధిపతి హకీమ్ షరీఫ్ చిష్తి ఉర్సు ఉత్సవాలకు విచ్చేసిన సందర్భంగా, గ్రామానికి చెందిన భక్తులతో పాటు, మండలానికి,చెందిన భక్తులు,నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.అలాగే ఉమ్మడి మెదక్ జిల్లా హైదరాబాద్,రంగారెడ్డి, జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు.గురువు యొక్క ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది.భక్తులు మొక్కలు చెల్లించుకున్నారు. సిద్దిపేట పీఠాధిపతి హకీమ్ షరీఫ్ చిష్తి యొక్క ఆశీర్వాదం భక్తులందరిపై ఎల్లవేళలా ఉంటాయని ఆశ్రమ నిర్వాహకులు లతీఫ్ షరీఫ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నవాబ్ పేట్ గ్రామ సర్పంచ్ ఏనుగు అశోక్ రెడ్డి, కొత్తపేట గ్రామ సర్పంచ్ లింగరబోయిన రాములు,బిజిలి పూర్ సర్పంచ్ కుక్కల పెంటమ్మ, గంగయ్య పల్లి సర్పంచ్ రావెల్లి సాయిలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు,కార్యకర్తలు తదితరులు విచ్చేశారు.

# ముంబయిలో షూటింగ్..
## చెన్నై నుంచి ఫుడ్ ఆర్డర్ పెట్టిన ప్రభాస్



'కపుల్ ఫ్రెండ్లీ' చూసి ఆ ఫీల్ నుంచి బయటకు రావడానికి చాలాసేపు పట్టిందని ప్రభాస్ అన్నారు. చివరి 20 నిమిషాలు మరో స్థాయిలో ఉందని ప్రశంసించారు. తాజాగా ఈ మూవీ టీమ్ ప్రభాస్‌ను కలిసింది. ఆ చిత్ర బృందంతో ప్రభాస్ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. విజయవాడ పునుగులు అంటే తనకు ఇష్టమని చెప్పారు.

"నేను అభిమానుల కోసం సంవత్సరానికి మూడు, నాలుగు సినిమాల్లో నటిస్తున్నాను. కానీ, ఒక్కటే విడుదలవుతోంది. నాకు 'గీతాంజలి' అంటే చాలా ఇష్టం. అందరూ నాకు యాక్షన్ చిత్రాలంటే ఇష్టమనుకుంటారు. నాకు అన్ని జానర్ల పైనా ఆసక్తి ఉంది. ప్రత్యేకించి మణిరత్నం అభిమానిని.

'కపుల్ ఫ్రెండ్లీ' చూసినప్పుడు నాకు 'గీతాంజలి' చూస్తున్న ఫీల్ కలిగింది. అందుకే నాలుగు సార్లు చూడాలని నిర్ణయించుకున్నాను""పూరి జగన్నాథ్‌లా ఎవరూ రాయలేరు. ఆయన 'బుజ్జిగాడు' కథ చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. ఎలా చేయాలి అని టెన్షన్ వచ్చింది. తర్వాత ఆయన దర్శకత్వంలో 'ఏక్ నిరంజన్' చేశా. ఆయనలా డైలాగులు రాసేవాళ్లు ప్రపంచంలోనే లేరు. ఆయనది ఒక ప్రత్యేకమైన శైలి. నా సినిమాల్లో కాస్ట్యూమ్స్ కూడా డిఫరెంట్‌గా ఉండేలా చూస్తాను"

"అందరికీ నా ఫుడ్ గురించి తెలుసుకోవాలని ఉంటుంది. మీకో ఆసక్తికర విషయం చెబుతాను. నేను అప్పుడప్పుడు వేరే రాష్ట్రాల నుంచి ఫుడ్ ఆర్డర్ పెడతాను. 'ఆదిపురుష్' షూటింగ్ ముంబయిలో జరిగేటప్పుడు చెన్నై నుంచి ఫుడ్ ఆర్డర్ పెట్టా. టీమ్ అందరూ షాక్ అయ్యారు. ఫ్లైట్‌లో ఆర్డర్ తీసుకొచ్చిన వ్యక్తి నా దగ్గరకు వచ్చి 'మీరు మాములు వాళ్లు కాదండీ' అన్నాడు" అని ప్రభాస్ గుర్తుచేసుకున్నారు.

'మీ దృష్టిలో ప్రేమంటే ఏంటి?' అని హీరోయిన్ మానస వారణాసి అడగ్గా.. పర్సనల్ క్వశ్చన్ కదా అంటూ ప్రభాస్ నవ్వులు పూయించారు. లవ్ అనగానే ప్రస్తుతానికి 'కపుల్ ఫ్రెండ్లీ' గుర్తొస్తుందన్నారు. ఈ సినిమా చూశాక ప్రేమలో పడాలని ఉందన్నారు. హీరో సంతోశ్ శోభన్ అడిగిన వెంటనే.. అతడికి ఫోన్ నంబరు ఇచ్చారు. ఈ మూవీ బ్యాక్‌డ్రాప్ గురించి ప్రభాస్ మాట్లాడుతూ.. చెన్నైలో తాను గడిపిన రోజులు గుర్తుచేసుకున్నారు. ప్రభాస్‌కు హిట్ ఇచ్చిన 'వర్షం' డైరెక్టర్ శోభన్ తనయుడే ఈ సంతోశ్.

# రూ.10 కోట్లు చెల్లించండి.. రణ్‌వీర్‌సింగ్‌కు బిష్ణోయ్ గ్యాంగ్ మరోసారి బెదిరింపులు



బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ కు వరుస బెదిరింపులు రావడం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం ఉదయం మరోసారి బెదిరింపులు వచ్చాయి. రూ.10 కోట్లు డిమాండ్ చేస్తూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన ఓ వ్యక్తి నటుడికి వాయిస్ నోట్ పంపినట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. అమెరికాలో రిజిస్టర్ అయిన నంబర్ నుంచి ఈ వాయిస్ నోట్ వచ్చినట్లు సమాచారం. దీనిపై ముంబయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు సంబంధిత అమెరికా దర్యాప్తు సంస్థలను సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కూడా బాలీవుడ్ ప్రముఖులకు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాను లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన హ్యారీ బాక్సర్‌గా పరిచయం చేసుకున్న ఓ వ్యక్తి కొందరు సెలబ్రిటీలకు వాట్సప్‌లో వాయిస్ నోట్ పంపాడు. తన డిమాండ్‌లను అంగీకరించకపోతే సిబ్బంది అందరినీ హత్య చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. "మీ మేనేజర్ దగ్గర నుంచి మీ వద్ద పనిచేసే వ్యక్తిగత సిబ్బంది వరకూ అందరి వివరాలు మాకు తెలుసు. వారు కుటుంబాలతో ఎక్కడ నివసిస్తున్నారో కూడా తెలుసు. మా టార్గెట్ వాళ్లే. వాళ్లకు ఏం జరగకముందే మీరు మారండి" అని ఆడియో పంపాడు.

# రామోజీ ఫిల్మ్‌సిటీలో వృషకర్మ




కథానాయకుడు నాగచైతన్య నటిస్తున్న కొత్త చిత్రం 'వృషకర్మ'. 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు తెరకెక్కిస్తున్న ఈ సినిమాని సుకుమార్ రైటింగ్స్, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మీనాక్షి చౌదరి కథానాయిక. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా నుంచి ఓ గ్లింప్స్ విడుదల చేసేందుకు చిత్ర వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. ఇప్పటికే దీనికి సంబంధించిన పనులు మొదలవ్వగా.. మార్చి తొలివారంలో దీన్ని విడుదల చేయనున్నట్లు సమాచారం. ఈ గ్లింప్స్‌తోనే ఈ చిత్ర కథా ప్రపంచాన్ని.. దాని స్కేల్‌ను ప్రేక్షకులకు పరిచయం చేయనున్నట్లు తెలుస్తోంది. దీనితోనే విడుదల తేదీపైనా స్పష్టత ఇచ్చే అవకాశముందని తెలిసింది. చైతన్య ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో అర్జున్ అనే నిధి అన్వేషకుడిగా కనిపించనున్నారు. దక్ష అనే ఆర్కియాలజిస్ట్‌గా మీనాక్షి అలరించనుంది. దీనికి అజనీశ్ లోక్‌నాథ్ సంగీతమందిస్తున్నారు.

# మిస్టిక్ థ్రిల్లర్ కథలో!

ఒక ప్రత్యేకమైన ప్రపంచాన్ని ఆవిష్కరించే కథ... అందులో అబ్బురపరిచే ఫాంటసీ అంశాలు, భక్తి కోణం, థ్రిల్లింగ్‌గా సాగే కథనం... ఇలాంటి మేళవింపుతో కూడిన మిస్టిక్ థ్రిల్లర్ సినిమాలు ఈ మధ్య ప్రేక్షకుల మనసుల్ని గెలుస్తున్నాయి. 'విరూపాక్ష' మొదలుకొని పలువురు కథానాయకులు ఈ తరహా కథలతో విజయాల్ని సొంతం చేసుకున్నారు. కల్యాణ్‌రామ్ కొత్త సినిమా కూడా మిస్టిక్ థ్రిల్లర్ కథతోనే రూపొందనున్నట్టు తెలుస్తోంది. కల్యాణ్‌రామ్ తదుపరి సినిమా ప్రముఖ రచయిత శ్రీకాంత్ విస్సా దర్శకత్వంలో రూపొందనుంది. ఇప్పటికే కథా చర్చలు పూర్తయ్యాయి. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే ఈ సినిమాని పట్టాలెక్కించేందుకు రంగం సిద్ధమవుతోంది. రచయితగా మంచి పేరున్న శ్రీకాంత్ విస్సా దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రమిదే. ఆయన విభిన్నమైన మిస్టిక్ థ్రిల్లర్ కథతో, భారీస్థాయి సినిమాని రూపొందించనున్నట్టు తెలుస్తోంది. విజువల్‌గా




ప్రత్యేకమైన అనుభూతిని పంచే సినిమాల్ని ఇష్టపడుతున్న ప్రేక్షకుడి అభిరుచుల్ని దృష్టిలో ఉంచుకుని శ్రీకాంత్ విస్సా ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు.

# రెండు విధాలుగానూ అవమానాలే!



హిందీ భాషపై మంచి పట్టు ఉన్నప్పటికీ బాలీవుడ్‌లో తన సినీ ప్రయాణం అనుకున్నంత సులభంగా సాగలేదంటోంది హీరోయిన్ రెజీనా. దక్షిణాదికి చెందిన ఈ తార తెలుగు సినిమాలతోపాటు పలు హిందీ, తమిళ చిత్రాలతోనూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రెజీనా హిందీ చిత్రసీమలోని కెరీర్ గురించి పలు విశేషాలను పంచుకుంది. "నేను దక్షిణ భారత నటిని. అయినప్పటికీ హిందీ చాలా బాగా మాట్లాడేదాన్ని. బాలీవుడ్ కెరీర్ ప్రారంభంలో నాకు కొన్ని సవాళ్లు ఎదురయ్యాయి. చాలామంది నన్ను మాటలతోనే కాదు.. చేతలతోనూ అవమానించిన సందర్భాలున్నాయి. అప్పుడు హిందీ భాషపై నాకున్న పట్టు నన్ను ప్రత్యేకంగా నిలబెట్టింది. కానీ, అలాంటి పరిస్థితుల్లో సినిమాలను ఎంచుకోవడం చాలా కష్టంగా ఉండేది. తక్కువ ప్రాధాన్యత ఉండే పాత్రలు వచ్చేవి. వాటిని చేయడం సులభమే. కానీ, నేను మెయిన్ స్ట్రీమ్ కమర్షియల్ చిత్రాలను చేయాలనుకోవడం లేదు. అందుకని వైవిధ్యంగా ఉండే పాత్రలనే ఎంచుకునేదాన్ని. బాలీవుడ్‌లో అప్పుడు నాకు ఎదురైన పరిస్థితులే ఎప్పటికీ అలానే ఉంటాయని నేను చెప్పను. ఎందుకంటే ఇప్పుడు చాలామంది భాషలతో సంబంధం లేకుండా అన్ని చిత్రపరిశ్రమలలోనూ నటిస్తున్నారు"అని చెప్పుకొచ్చింది. రెజీనా తదుపరి.. అగ్ర కథానాయిక నయనతార నటిస్తున్న 'మూకుతి అమ్మన్ 2' సినిమాలో కనిపించనుంది.



# ఎవరూ ఊహించని పాత్రలో రష్మిక.. వైరలవుతోన్న న్యూస్!

వరుస విజయాలతో అలరిస్తున్నారు నటి రష్మిక. ఎలాంటి పాత్రలోనైనా ఒదిగిపోతూ మల్టీటాలెంటెడ్ అని నిరూపించుకుంటున్నారు. ఇప్పుడు ఆమె తర్వాత ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాలీవుడ్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'కాక్‌టెయిల్ 2' షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలో రానున్న ఈ సినిమాలో కృతి సనన్, రష్మిక కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వీరి పాత్రల గురించి బాలీవుడ్ మీడియాలో వచ్చిన వార్త అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ చిత్రంలో కృతి రష్మిక స్వలింగ ప్రేమికులుగా కనిపించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ట్రయాంగిల్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం రానున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక సమాచారం రాకపోయినప్పటికీ వీరి పాత్రల గురించి ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది.

హోమీ అదజానియా దర్శకత్వంలో 'కాక్‌టెయిల్ 2' రానుంది. జనవరి 31న ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు టీమ్ తెలిపింది. ఇది ఎంతో ప్రత్యేకంగా నిలవనుందని ఆ సందర్భంగా దర్శకుడు వెల్లడించారు. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు. షాహిద్ ఇందులో ఇప్పటివరకూ చూడని పాత్రలో కనిపించనున్నట్లు చెప్పారు. 2012లో దీపికా పదుకొణె, డయానా, సైఫ్ అలీఖాన్‌లు నటించిన 'కాక్‌టెయిల్' చిత్రానికి సీక్వెల్‌గా 'కాక్‌టెయిల్ 2' రానుంది.



printed , published and owned by DR.B.ANILKUMAR ,@ 407 THARNAKA , HYDERABAD , Telangana state.published at DAIWIK PUBLICATIONS pvt.ltd.printed at SNEHITHA PRINTERS H.NO : 2-6 , Warangal Dist.Telangana state ,EDITOR DR.B.ANILKUMAR ,RNI NO TELTEL/2021/ 81079 , cell : 7702866885 ,vijethatelugudaily@gmail.com